
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 19 డిసెంబరు 2024 | 5



కోట సత్తెమ్మకు బోనాలు సమర్పణ





నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో మేళ తాళాలతో వైభవంగా కోట సత్తెమ్మకు భక్తులు బుధవారం చీర సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్తెమ్మ తిరునాళ్లలో నాల్గోరోజైన బుధవారం 101 మంది మహిళలతో అమ్మ వారికి చీర, సారె, పసుపు కుంకు మలు సమర్పించారు. - 7లో

విమానాశ్రయం వద్ద మంత్రి నారాయణకు ఘన స్వాగతం



మంత్రి నారాయణకు విమానాశ్రయం వద్ద నేతల ఘన స్వాగతం

కోరుకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్ర వరం విచ్చేసిన మంత్రి నారాయణకు బుధవారం మధురపూడి విమానాశ్రయం వద్ద ఎమ్మెల్యేలు బత్తుల బల రామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ ప్రశాంతి తదిత రులు ఘనస్వాగతం పలికారు.



'గ్రేటర్' కల నిజమయ్యేనా..

- జులైలోపు రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఎన్నికలు
- మంత్రి నారాయణ స్పష్టీకరణ
- 2019 జులై 2వ తేదీతో ముగిసిన పాలకవర్గం
- పదేళ్ల తర్వాత రానున్న ఎన్నికలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు వచ్చే ఏడాది జూన్, జూలై నెలల్లో జరి గే అవకాశం ఉంది. ఈ విషయాన్ని రాష్ట్ర పుర పాలకశాఖ మంత్రి పి.నారాయణ స్వయంగా చెప్పడంతో రాజకీయ వర్గాల్లో సందడి నెలకొంది. అయితే ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న గ్రేటర్ రాజమహేంద్రవరం కల నెరవేరుతుందా.. పరిస ర గ్రామాల విలీన ప్రక్రియ పూర్తిచేసి ఎన్నికలు నిర్వహిస్తారా, లేదా ఇప్పుడున్న విధంగానే జరు గుతాయా అనేది స్పష్టత లేదు. గోదావరి పుష్క రాలు, ఇతర అంశాలపై రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన సమీక్షకు వచ్చిన మంత్రి నారాయణ మీడియా ప్రశ్నలకు కూడా స్పష్టత ఇవ్వలేకపోయారు. కానీ కొందరు ఎమ్మెల్యేలు మాత్రం గ్రామాల విలీనంతోనే ఎన్నికలు జరుగ నున్నాయని, కోర్టు కేసుల్లో ఉన్న విలీన సమస్య ను పరిష్కరించి ఎన్నికలు వెళతామని చెప్పడం గమనార్హం. రాజమహేంద్రవరం నగరపాలక సం స్థలో రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని గ్రామాలు, కోరుకొండ మండలంలోని కొన్ని గ్రా మాలు, రాజానగరం మండలంలోని కొన్ని గ్రామా లతో మొత్తం 22 గ్రామాలతో కలసి గ్రేటర్ రాజ మహేంద్రవరం చేయాలని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. గ్రామాలను విలీనం చేసి 54 డివిజన్లతో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది. గ్రామాలను అనుసంధానం చేస్తూ 80 అడుగుల నుంచి 100 అడుగుల రోడ్లు నిర్మించడానికి, డ్రైనే జీ, విద్యుత్ సౌకర్యాలు కల్పించడానికి అప్పట్లో ప్లాన్ చేసింది. పరిసర గ్రామాలన్నీ అభివృద్ధి చేయడం ద్వారా సిటీని విస్తరించాలని ప్లాన్ చేశారు. కానీ 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారం లోకి రావడంతో విలీన ప్రక్రియ మూలన పడిం ది. కేవలం కొన్ని గ్రామాలనే విలీనం చేసి, డివి జన్ల సంఖ్య 54 నుంచి 52కు తగ్గించే ప్రయత్నం చేశారు. అదీ సాగలేదు. గ్రామాల విలీనాన్ని కొం దరు నాయకులతో కలసి రియల్ ఎస్టేట్ వ్యాపా రులు, ఖాళీ స్థలాల యజమానులు ఆపేసినట్టు ప్రచారం జరిగింది. దాంతో గ్రేటర్ రాజమహేంద్ర వరం కలలు సన్నగిల్లాయి. గ్రామాలకు రోడ్లు, డ్రెయిన్లు లేవు. పారిశుధ్య సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయి. అలాగని అక్కడి గ్రామాల కు ఎన్నికలు కూడా నిర్వహించలేదు. దీంతో 15 ఆర్థిక సంఘం నిధులు కూడా రావడంలేదు. ఫలి తంగా గ్రామాలు ఇబ్బంది పడుతున్నాయి. ఎన్ని కలు లేక కార్పొరేషన్‌లోనూ ఇబ్బంది కలుగుతోం ది. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ గ్రేటర్ కలలు వికసిస్తాయనే భావం కలిగింది. కొద్దిరోజుల కిం దట ఎయిర్‌పోర్టుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్ర బాబు వద్ద పలువురు ఎమ్మెల్యేలు గ్రామాల విలీ నం, ఎన్నికల గురించి ప్రస్తావించినట్టు సమా చారం. ప్రస్తుతం మంత్రి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పడంతో ఈలోపు విలీన ప్రక్రియ పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

● 22 గ్రామాలు విలీనం చేస్తారా?

మొదట్లో ప్రతిపాదించినట్టు రాజమహేంద్ర వరం రూరల్ మండలం మొత్తం కలపడంతో పాటు, కడియం మండలంలోని వేమగిరిని, కోరు కొండ మండలంలోని కొన్ని గ్రామాలను, రాజా నగరం మండలంలోని పలు గ్రామాలను కలపి మొత్తం 22 గ్రామాలను విలీనం చేస్తారా లేదా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నా యి. రాజానగరం మండలంలోని పలు గ్రామా లను విలీనం చేయడానికి అక్కడి స్థానిక నేతల అభ్యంతరం చెబుతున్నట్టు ప్రచారం ఉంది. కానీ ప్రజలు మాత్రం విలీనం కోరుకుంటున్నారు. ము ఖ్యంగా యువత అభివృద్ధిని కోరుకుంటోంది. నగరపాలక సంస్థ విస్తీర్ణం పెరిగితే పరిసర ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని భావి స్తోంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం మాత్రం పూర్తిగా కలిసిపోయినట్టే. వేమగిరి కూడా విలీనం అయినట్టే చెప్పవచ్చు. రూరల్ మండలంలోని ఒకటి రెండు గ్రామాల నుంచి కోర్టు కేసులు ఉన్నాయి. వాటిని పరిష్కరించే ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. అదే ప్రయత్నం కోరుకొండ, రాజానగరం మండలం నుంచి కూడా జరిగితే ఆయా ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి. కార్పొరేషన్‌లో కలిపితే పన్నులు పెరిగిపోతాయనే భయాన్ని ప్రజల్లో కొందరు కల్పిస్తున్నారు. కానీ గ్రామాల్లో కూడా పన్నులు కడుతున్నారు కదా? విలీనమైతే రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం లభిస్తుంది. ప్రజల జీవన విధానంలో మార్పు వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● ఎన్నికల కోసం ఎదురుచూపులు

వచ్చే ఏడాది జూలైలోపు ఎన్నికలు నిర్వహి స్తామని మంత్రి నారాయణ స్పష్టంచేయడంతో ప్రజలు, రాజకీయ వర్గాల్లో సందడి నెలకొంది. జోష్ పెరిగింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పాలకవర్గం ఎన్నికలు రాష్ట్ర విభజన తర్వా త 2015లో తెలుగుదేశం పార్టీ హయాంలో జరి గాయి. మేయర్‌గా పంతం రజనీ శేషసాయి తెలు గుదేశం పార్టీ తరపున ఎన్నికైన సంగతి తెలి సిందే. వారి పాలక వర్గం 2019 జూలై 2తో ము గిసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెల వడంతో జూలైలో ఎన్నికలు నిర్వహించలేదు. తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. దీనికి ప్రధాన కారణం నగరపాలక సంస్థ పరిధిలో టీడీపీకి కం చుకోట. ఇప్పటివరకూ జరిగిన మేయర్ ఎన్నికల్లో టీడీపీనే గెలిచింది. ముఖ్యంగా బీసీలు ఎక్కువ. బీసీ, ఎస్సీలు సుమారు మూడో వంతు వరకూ ఉన్నారు. టీడీపీకి బీసీల సపోర్టు చెక్కుచెదర కుండా కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లోనే గెల వలేమనే భయంతోనే వైసీపీ ఎన్నికలు నిర్వహిం చలేదనే విమర్శలు అప్పట్లో వినిపించాయి. ఈసారి తెలుగుదేశం -జనసేన- బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందడి రానుంది.

పుష్కరాలు-2027కు సన్నద్ధం కావాలి!





- రెండేళ్లలో పనులు పూర్తి చేయాలి
- ఇప్పటికే రాజమండ్రి-కొవ్వూరుకి కలిపి 1868.70 కోట్ల ప్రతిపాదనలు
- ఘాట్లు, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కారం కావాలి
- అధికారుల సమీక్షలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

పుష్కరాలు, ఇతర అంశాలపై రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ.. సమీక్షకు హాజరైన అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు 2027కు అధికారులంతా సన్నద్ధం కావాలని రాష్ట్ర మున్సి పల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం రాజమం డ్రి నగరపాలక సంస్థ, కొవ్వూరు డివిజన్ అధికా రులతో మంత్రి నారాయణ, కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పి.ప్రశాంతి, ఎమెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకట్రావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, కమిషనర్ కేతన్‌గార్గ్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత లతో పుష్కరాల 2027పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కమిష నర్ కేతన్‌గార్గ్ పుష్కరాలకు సంబంధించి రాజ మహేంద్రవరంలో చేపట్టే ఘాట్ల నిర్మాణ ప్రతి పాదనలు, రహదారుల ప్రతిపాదనలు, డ్రైనేజీ నిర్మాణాలు, తాగునీటి సదుపాయాలు, రవాణా సదుపాయాలు, వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిం చారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించి రహదారులు, డ్రైనేజీల నిర్మాణా లకు, ఘాట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. నాలుగు కొత్త ఘాట్ల నిర్మా ణాలు చేపడతామని మంత్రి దృష్టికి తెచ్చారు. అదేవిధంగా కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత కూడా కొవ్వూరు, నిడదవోలు, విజ్జేశ్వరం, కుమా రదేవం, ప్రాంతాలలో అభివృద్ధిపనులు, కొవ్వూరు గోష్పదాల రేవు అభివృద్ధి, బ్యూటిఫికేషన్, గోదా వరి సురక్షిత తాగునీరు అందించే ప్రతిపాదనలు, రహదారుల విస్తరణ అంశాలపై పవర్ పాయిం ట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వీటన్నింటిపైన జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలతో మంత్రి చర్చిం చారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లా డుతూ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి సమ గ్ర ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఆసి యన్ డవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా గతంలో ప్రతిపాదించిన పనులను ఫిబ్రవరి నెలలో తిరిగి ప్రారంభించనున్నట్టు చెప్పారు. 70 శాతం ఏడీబీ రుణం, మిగిలిన 30 శాతం ప్రభుత్వ గ్రాంటు విడుదల చేయడం జరుగుతుందన్నారు. తాగు నీటి సమస్యను అధిగమించేందుకు అమృత్ పథకం 2.0 పథకం కింద రూ.8400 కోట్లు కేం ద్రం గ్రాంటు ఉందని, ఇందులో కేంద్రం 36.70 శాతం గ్రాంటు ఇస్తున్నట్టు చెప్పారు. మిగిలిన నిధులను స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నిధులు అనుసంధానం చేయను న్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల పనులు రానున్న రెండేళ్లలో పూర్తిచేసి గోదావరి పుష్కరా ల నాటికి రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తా మన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థలను ఆర్థి కంగా బలోపేతం చేయడానికి అదనపు పన్నులు వేయకుండా అసెస్మెంట్‌లు చేస్తామని, దీని ద్వారా నగరంలో రూ.79 కోట్ల బకాయిల వసూ ళ్లకు చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార కట్టడాలకు సంబంధించి సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామ న్నారు. 2027 గోదావరి పుష్కరాలకు రాజమ హేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 1587.80 కోట్లు, కొవ్వూరు డివిజన్‌లో రూ.280.90 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మొత్తం రూ1868,70 కోట్లు ప్రతిపాదనలు ఉన్నా యని అన్నింటిపైన సీఎం చంద్రబాబుతో చర్చి స్తానని, మరొక 15 రోజుల్లో మళ్లీ వచ్చి అన్ని ప్రభుత్వ శాఖలతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. పుష్కరాలకు మనకు సమయం ఉంది కాబట్టి అన్ని పనులు ఇప్పటి నుంచే మొదలు పెట్టుకో వాలన్నారు. అదేవిధంగా రాజమహేంద్రవరం సిటీకి సంబంధించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్‌కు సంబంధించి ఎమ్మెల్యే గోరంట్ల, కొవ్వూ రుకు సంబంధించి ముప్పిడి వెంకట్రావులు పుష్కరాల పనులు, సమస్యలపై మంత్రి నారా యణ, కలెక్టర్ ప్రశాంతిలతో చర్చించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎస్ఈ జి పాండురం గారావు, డిప్యూటి కమిషనర్ ఎస్ వెంకటరమణ, రుడా అధికారులు మూర్తి, టౌన్ ప్లానింగ్ అధి కారి కోటయ్య, నగర పాలక సంస్థ అధికారులు మాలిక్, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందరూ 'నిరుపేదలే!'

జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య చూస్తే 80 శాతం మంది ఇప్పటికీ పేదరికంలోనే మగ్గుతున్నారు. కేవలం పది శాతం మంది మాత్రమే సంపన్నులు. మిగిలిన వారంతా నిరుపేదలు. చిత్రంగా ఉన్నా గణాంకాలను పరిశీలిస్తే ఇదే పరిస్థితిని తెలియజేస్తోంది. రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న నేపథ్యంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. పేదలు పంపిణీ చేస్తున్న బియ్యం తినకుండా వందలాది టన్నుల మేర అమ్మేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్న తరుణంలో ఈ బియ్యం ఎవరు అమ్మేస్తున్నారన్న చర్చ కూడా వస్తోంది. అనర్హులకు ఉన్న కార్డుల వారికి కేటాయించిన బియ్యమే ఎక్కువగా పక్కదారి పడుతోందన్నది తాజా చర్చ.

- జిల్లాలో సుమారు 80 శాతం మంది దిగువ తరగతి వారే
- 5,74,907 బీపీఎల్ కార్డులు
- 16 లక్షల మందికి రేషన్
- 2,39,021మందికి పింఛన్లు
- అర్హులకు అన్యాయం..అనర్హులకు కార్డులిచ్చిన గత వైసీపీ ప్రభుత్వం

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు, పింఛన్లు, ఉచిత గ్యాస్ పథకంతోపాటు ప్రభుత్వ పేదలకు ప్రవేశపెట్టే ఏ పథకానికైనా తెల్లరేషన్ కార్డునే పరిగణలోకి తీసుకుంటారు. గత ప్రభుత్వాలు ఓట్ల రాజకీయంతో నిబంధనలను పక్కనపెట్టి తెల్లరేషన్ కార్డులు నిజమైన అర్హులను తొలగిం చి అనర్హులకు మంజూరు చేసేశారు. నిరుపేద లకు, పూరిగుడిసెల్లో నివసించేవారికి, అత్యల్ప ఆదాయం గలవారికి తెల్లరేషన్ కార్డుల మం జూరు చేయడంలో తప్పులేదు. కానీ భారీగా ఆస్తులు, పొలాలు ఉన్నవారికి, ప్రైవేటు కంపె నీలో పనిచేసేవారికి, పిల్లలు విదేశాల్లో స్థిరపడి ఆర్థికంగా కలిగినవారికి, ఆదాయపు పన్ను రిట ర్న్ ఫైల్ చేసినవారికి కూడా స్థానిక నేతల సహకారంతో తెల్లరేషన్ కార్డులు మంజూరు చేసేశారు. ఇక రికార్డులను పరిశీలిస్తే జిల్లాలో 5 లక్షల 74వేల 907 బీపీఎల్ కార్డులున్నాయి వీటి ద్వారా 15 లక్షల 99వేల 725 మంది లబ్ధి దారులు రేషన్ తీసుకొంటున్నారు. 2011 జనా భా లెక్కల ప్రకారం 18లక్షల 32వేల 332 మం ది, అదే 2023 లెక్కల ప్రకారం 19 లక్షల 81 వేల 551 మంది ఉన్నారు. ఇదంతా సంబంధిత అధికారుల ఇచ్చిన నివేదిక ప్రకారమే. ఏ నివే దికల ప్రకారం చూసుకున్నా జిల్లా జనాభాలో 80 శాతం పైబడి నిరుపేదలే ఉన్నట్టు లెక్క. కార్డులన్నీ 2023కు ముందువే. వీరిలో సుమారు 80శాతం పైబడి రేషన్ సరుకులు వినియోగిం చుకోనివారే. లబ్ధిదారులు రేషన్ వెహికిల్ వద్ద కు వచ్చి వేలిముద్ర వేసి సరుకులను డబ్బులిచ్చి కొనుక్కోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో లబ్ధిదారులు వేలిముద్ర వేస్తే డీలరు లబ్ధిదారునికి బియ్యం కిలో ఒక్కింటికి రూ.8 నుంచి 9 (ప్రాంతాలను బట్టి) చెల్లిస్తూ సరుకు మాత్రం అక్రమార్కు లకు చేరవేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ పో ర్టిఫైడ్ బియ్యం తింటే చాలా జబ్బులు తగ్గించు కోవచ్చు. అలాంటి బియ్యం మాఫియా చేతుల్లోకి పోతోంది. ఇదంతా సివిల్ సప్లయి అధికారుల పర్యవేక్షణ లోపమంటూ కొందరు, ఈ వ్యవహా రమంతా అధికారులకు తెలిసే జరుగుతుందం టూ మరికొందరు ఆరోపణలు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 3.60 లక్షల ఇళ్లు

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవ రం డివిజన్ పరిధిలోని 146 పంచాయతీల్లో 2లక్షల6వేల335, కొవ్వూరు డివిజన్ పరిధిలో 153 పంచాయతీల పరిధిలో లక్షా 53 వేల 984 పంచాయతీ అధికారుల నివేదికల ప్రకారం ఎసెస్‌మెంట్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు రకాల పింఛన్లు కలిపి 2 లక్షల 39వేల 21 మంది లబ్ధిదారులకు పింఛన్లు సుమారు రూ.102 కోట్లు ప్రభు త్వం నెల నెలా పంపిణీ చేస్తోంది.







ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీలను ఎంపీ పురందేశ్వరితో కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి సమస్యలపై కేంద్ర మంత్రులకు వినతి

ఢిల్లీలో ఎంపీ పురందేశ్వరితోపాటు కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అన పర్తి నియోజకవర్గం బిక్కవోలులోని లక్ష్మీ గణ పతి ఆలయం, గోలింగేశ్వర స్వామి పెదపూడి మండలం గొల్లల మామిడాడ సూర్యనారాయ ణమూర్తి, కోదండ రామాలయాల్లో మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనకు టెంపుల్ టూరిజం ద్వారా ప్రసాద్ స్కీం ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర సాంస్కృతిక ప ర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కో రుతూ వినతిపత్రం అందజేశారు. బుధవారం ఎంపీ పురందేశ్వరితో కలిసి ఆయన మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే విశాఖకు వెళ్లేందుకు ప్రయాణికులు పడుతు న్న ఇబ్బందులను తొలగించేందుకు అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కల్పించాలని కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనపర్తి రైల్వే స్టేష న్‌కు కల్పించాల్సిన సౌకర్యాలు, రైళ్ల హాల్టు విషయాలను ఎమ్మెల్యే మంత్రికి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మె ల్యే తెలిపారు. అలాగే నియోజకవర్గంలో పలు రోడ్లను సీఆర్ఐఎఫ్ నిధులతో అభివృద్ధి చేయా లని కేంద్ర రోడ్డురవాణా, జాతీయ రహదారు ల మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీకి కూడా వి నతిపత్రం అందజేశానని నల్లమిల్లి తెలిపారు.



రాజమహేంద్రవరం మండలం హుకుంపేటలో అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

హుకుంపేట రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆకస్మిక తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో భూసంబంధిత సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రజలు ప్రత్యక్ష హాజరు సమయంలో రికార్డులను పరి శీలించడం, వాస్తవ పరిస్థితులను వివరించ డం కోసం గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వ హించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటలో నిర్వహిస్తు న్న రెవెన్యూ గ్రామసభను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ గ్రామసభలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించి భూ సం బంధిత అంశాలపై వచ్చిన అర్జీలను స్వీకరిం చాలన్నారు. స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీని పీజీఆర్ఎస్ పోర్టరులో అప్‌లోడ్ చేయా లన్నారు. కాగా బుధవారం ఇక్కడ నిర్వహిం చిన రెవెన్యూ సదస్సులో 14 అర్జీలు రావడం జరిగిందని తహశీల్దార్ కుమార్ తెలిపారు.

ధనుర్మాసం వచ్చిందంటే చాలు సూర్యోదయానికి ముందే హరిలో రంగ హరి... అంటూ చేతిలో చిడతలు, తంబుర వాయిస్తూ తలపై అక్షయపాత్రతో ప్రత్యక్షమవుతారు హరిదాసులు. సంక్రాంతి నెలలో మనకు కనిపించే గొప్ప సంప్రదాయాల్లో ఒకటి హరిదాసుగానం. పూర్వం పల్లె, పట్టణం తేడాలేకుండా తెల్లవారుజామునే ముంగిట ముగ్గు లేసే సమయానికి పురవీధుల్లో కీర్తనలను ఆలపిస్తూ అలరించేవారు. భక్తిగీతాలను అలా పాడుకుంటూ సాగిపోవడం... ఎవరైనా ధన, ధాన్యాలను స్వయంపాకంగా ఇస్తే స్వీకరించడం వారి సంప్రదాయం.... హరిదాసుపై ప్రత్యేక కథనం...





పల్లెలు, పట్టణాల్లో మొదలైన హరిదాసుల సందడి

సంక్రాంతికి వచ్చేశాం..

(ఆంధ్రజ్యోతి, తుని రూరల్/అంబాజీపేట)

హరిదాసు అంటే..

హరిదాసు అనగా పరమాత్మతో సమానం. మనుషులు ఇచ్చే దానధర్మాలు అందుకుని వారికి ఆయురారోగ్యాలు, భోగ భాగ్యాలు కలగాలని దీవించేవారే హరిదాసులు. నెలరోజులపాటు హరినామాన్ని గానం చేసినందుకు చివరి రోజున ఇచ్చే ధన, ధాన్యాలను, వస్త్ర దానాలను స్వీకరిస్తారు. వీరి వస్త్రధారణ ప్రత్యేకంగా ఉంటుంది. పట్టు ధోవతి కట్టి, పట్టు కండువా నడుమ చుట్టి మెడలో ఒక పూల హారం ధరించి చక్కగా తిలకం దిద్దుకుంటారు. సూర్యభగవానుడు ప్రసాదించిన అక్షయ పాత్రగా శిరస్సుపై పంచలోహ పాత్ర ధరిస్తారు. తెల్లవారకముందే ఈ అలంకరణ పూర్తి చేస్తారు. గోదాదేవిని స్మరించి తిరుప్పావై పఠించి విధుల్లోకి వెళ్తారు. తిరిగి ఇంటికి వెళ్లే వరకు హరినామ సంకీర్తన తప్ప ఏ ఇతర విషయాలూ మాట్లాడరు. తలపై అక్షయ పాత్రను కిందకు దించరు. ఇల్లు చేరిన తర్వాత ఆ ఇంటి ఇల్లాలు హరిదాసు పాదాలను కడిగి అక్షయ పాత్రను దించుతుంది. అలా ధనుర్మాసం అంతా ఎంతో నిష్టగా ఉంటారు హరిదాసులు.



శ్రీమహావిష్ణువుకు ప్రతిరూపాలుగా భావించే హరిదాసులు ధనుర్మాసంలో తెలుగు లోగిళ్లలో సందడి చేస్తారు. వీరు ధనుర్మాస అతిథులుగా పండగకు నెలరోజులు ముందు నెల గంట పట్టాక ధనుర్మాస ప్రవేశంతోనే ప్రజలకు వీరి దర్శనం కలుగుతుంది. తంబూర మీటుతూ, చితడలు వాయిస్తూ రామనామ సంకీర్తనలతో వినసొంపైన బాణీలతో అలరిస్తారు. హరిదాసులు అంటే పెద్దలకు భక్తిభావం, పిల్లలకు మాత్రం వారిని చూడడంలో సరదా ఉంటుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈనెలరోజులపాటు పొద్దున్నే వీరి పిలుపుతోనే పల్లెలు నిద్రలేస్తాయి.

పద్ధతి ఎలా వచ్చింది...

శ్రీరాముడి రాజ్యంలో చింతలు లేవు. కరువు కాటకాలు రావు. దానధర్మాలు చేద్దామన్నా పుచ్చుకునేవారే కరువయ్యారని ప్రజలు ధర్మదేవతను ఆడిపోసుకునేవారట. అది విన్న వేగులు రాముడితో చెప్పగా వారి దానధర్మాలను పుచ్చుకునేందుకు హరినామాన్ని గానం చేసే గాయకులను రాజ్యంలో తిరుగాడేలా చేశారని, వారే నేడు కన్పించే హరిదాసులని చెబుతుంటారు.

హరిదాసుల రామగానం..

ఏడాది అంతా వేర్వేరు పనుల్లో నిమగ్నమయ్యే హరిదాసులు ధనుర్మాసంలో మాత్రం తప్పకుండా రామగానం చేస్తారు. సొంత ఊళ్ల నుంచి వేరే ఊళ్లకు వెళ్తారు. గ్రామవీధుల్లో భజనలు చేస్తారు. ప్రతిఇంటి ముందు కూర్చుని లేవడం కష్టమైనా భక్తిభావంతో అదంతా మర్చిపోతారు. వంశపారంపర్యంగా అనేకమంది దశాబ్దాలుగా రామనామ స్మరణ చేస్తున్నారు. సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత తమ సొంత ఊళ్లకు వెళ్లే హరిదాసులు మిగతా రోజులు పొలం పనులు, కూలి పనులతో జీవనం సాగిస్తారు.

సంప్రదాయాన్ని కొనసాగించేందుకే...

శ్రీరామావతారంగా భావించి ఈ దీక్షను స్వీకరిస్తాం. ఉదయం 4 గంటల నుంచే పొగమంచులో ప్రయాణం ప్రారంభిస్తాం. చివరి రోజు స్వయంపాకంలో వందలు, వేల రూపాయలు ఇచ్చేవారు. ఇప్పుడు ఆదరణ బాగా తగ్గిపోయింది. దానం ఇచ్చే వారు తగ్గిపోయారు. ఏటా భద్రచలం వెళ్లి శ్రీరాముడికి రూ.2వేలు సమర్పించుకుంటా. భావితరాల వారు ఈ కళలోకి రావడానికి ఆసక్తి చూపడం లేదు. తరతరాలుగా వస్తున్న ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలన్నదే మా తాపత్రయం.


–సత్యనారాయణ, హరిదాసు, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

పాపాలు తొలగుతాయని..

సంక్రాంతికి ముందు అంటే ధనుర్మాసంలో హరిదాసులు వీధుల్లో కనువిందు చేస్తూ శ్రీమద్రామణ రమణ.. గోవిందో హరి అంటూ ఇంటి ముందు ముగ్గుల చుట్టూ ఒకసారి తిరుగుతారు. హరిదాసును వేకువజామునే దర్శిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. ఉట్టిచేతులతో ఆయన్ను పంపరు. అందుకే తుంబుర గానం వినిపించగానే గృహిణులు స్వయం పాకాలతో సిద్ధంగా ఉంటారు.

హైటెక్ హరిదాసులు

ధనుర్మాసం ప్రారంభమైన నెలరోజులపాటు హరిదాసులు వేకువజామునే గ్రామాల్లో ఇంటింటికీ నడుచుకుని తిరిగి సందడి చేసేవారు. ప్రస్తుత ఆధునిక కాలంలో అప్పటి హరిదాసులకు వయస్సు పెరగడంతోపాటు కీళ్లనొప్పులు తదితర రోగాల బారిన పడడంతో మోటార్‌సైకిల్‌పై ఇంటింటికీ వచ్చి బియ్యాన్ని స్వీకరిస్తున్నారు. ఆ మోటార్‌సైకిల్‌కు అక్షయపాత్రను ప్రత్యేకంగా అలకరించి మైక్‌లో హరిరామ సంకీర్తనను రికార్డింగ్ చేయించి ఇంటింటికీ వెళ్తుండగా భక్తులు కృష్ణార్పణం అంటూ అక్షయపాత్రలో బియ్యాన్ని పోస్తున్నారు. సంప్రదాయాలను పరిరక్షించడంలో భాగంగా నూటికి పది మంది హరిదాసులు కాలినడకనే నెత్తిపై అక్షయపాత్ర ధరించి ఇంటింటికీ తిరుగుతున్నారు.



శీతాకాలంలో జరభద్రం

- వ్యాధులు విజృంభించే సీజన్
- జాగ్రత్తలు తీసుకోకపోతే ముప్పు
- ఉన్ని దుస్తులు తప్పనిసరి
- గుండె, శ్వాస, రక్తపోటు రోగులు జాగ్రత్త
- ఎండవచ్చిన తర్వాతే వ్యాయామం చేయాలంటున్న వైద్యనిపుణులు

కోటనందూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): శీతాకాలంలో చలిప్రభావం రోజురోజుకూ పెరుగుతోంది. గజగజ వణికిస్తోంది. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ఉదయం 10గంటలవరకు ఎండరావడం లేదు. రోజంతా చలిగా ఉంటోంది. చలి తీవ్రతకు చిన్నారుల నుంచి వృద్ధులు, గుండె, మధుమేహం, రక్తపోటు ఉన్నవారు ఈ చలికాలంలో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. దీంతో ఈ కాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

ఎదురయ్యే సమస్యలు..

చలికాలంలో ప్రధానంగా జలుబు, గొంతు నొప్పులతో చిన్నారులు, వృద్ధులు సమస్యలతో బాధపడుతుంటారు. వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. పెదవులు పగిలి రక్తస్రావం జరుగుతుంది. చర్మం పొడిబారుతుంది. దీని వల్ల దురద ఎక్కువగా ఉంటుంది. 50ఏళ్లు పైబడినవారిలో కీళ్లనొప్పులు ఎక్కువగా ఉంటాయి. చల్ల నీళ్లతో స్నానాలు చేయడం, మంచులో ప్రయాణం చేయడం వల్ల పంటి సమస్యలతోపాటు, అస్తమా రోగులు శ్వాస తీసుకోవడం, జలుబు వంటివి తరచూ వస్తాయి. గుండె, రక్తపోటు ఉన్నవారు కూడా తీవ్ర ఇబ్బందులు పడతారని అంటున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

శీతాకాలం మంచులో తడవడం, చల్లగాల్లో తిరగడం చేయకూడదు. చిన్నపిల్లలను చలిగాలుల్లో ఆడుకోనివ్వరాదు. మంకీ టోపీలు, గ్లౌజులు, మాస్కులు వంటివి ధరించాలి. ఒకే చోట ఎక్కువ సమయం కూర్చోని ఉండకుండా చలి,మంచు తగలకుండా ఇంట్లోనే నడవాలి. జలుబు ఎక్కువగా ఉంటే ఆవిరి పట్టాలి. గొంతు సమస్య ఉన్నవారు ఒక గ్లాసు వేడినీటిలో చెంచా ఉప్పు వేసుకుని పుక్కిలించాలి. ఇన్‌ఫెక్షన్ వ్యాప్తి చెందకుండా చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. చేతి రుమాలను తరుచూ మారుస్తూ ఉండాలి. చిన్నపిల్లలకు ముక్కు మూసుకుపోయి శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిగా ఉంటే నాసికా రంధ్రాల్లో నాజల్ డ్రాప్స్ గానీ, ఉప్పు నీటి చుక్కలు గానీ వేయాలి. వేడి నీళ్లు తాగాలి. నిల్వ పదార్థాలను తినరాదు. ఆహారం వేడిగా ఉన్నప్పుడే తినాలి. పెదవులు పగిలిపోకుండా గ్లిజరిన్ కలిగిన లిప్ బామ్‌లను గానీ వెన్న, కొబ్బరి నూనె రాసుకోవాలి. రాత్రి సమయంలో రాసుకుంటే మంచిది. వాకింగ్ చేసేవారు విధిగా గ్లౌజులు, మాస్కులు, ఉన్ని దుస్తులు వేసుకోవాలి. ఆస్తమా ఉన్నవారు చల్లగాలులకు పూర్తిగా దూరంగా ఉండాలి. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, ఉన్ని దుస్తులు ధరించి ప్రయాణం చేయాలి. అన్ని జాగ్రత్తలు తీసుకుంటేనే ఈ శీతాకాలంలో ఇబ్బందులనుంచి గట్టెక్కగలమని వైద్య నిపుణులు చెప్తున్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



శీతాకాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. చిన్నపిల్లల్లో అస్తమా ఉంటే ఇబ్బందులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏడాదిలోపు శిశువులకు ఉదయం పూట స్నానం చేయించడంవల్ల ముక్కు బ్లాక్ అయి ఇబ్బందులు పడొచ్చు. ఎండ వచ్చిన తర్వాత చర్యలు చేపట్టాలి. గుండె, చక్కెరవ్యాధి, ఆస్తమా ఉన్నవారు తగుజాగ్రత్తలు తీసుకోవాలి.

డాక్టర్ రెడ్డి త్రినాథ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు, తుని ఏరియా ఆస్పత్రి

గర్భిణీలు జాగ్రత్తగా ఉండాలి



శీతాకాలంలో గర్భిణులు, బాలింతలు జాగ్రత్తగా ఉండాలి. ఉదయంపూట ఎండలో ఉండాలి. గదుల్లో వెచ్చదనం ఉండేలా చూసుకోవాలి. ఉన్నిదుస్తులతోపాటు ముఖానికి గాలి తగలకుండా చూసుకోవాలి.

అలమండ ప్రసన్న, గైనకాలజిస్టు



తుని–నర్సీపట్నం రహదారిపై మంచు కురుస్తున్న దృశ్యం



పాపికొండలు పర్యాటకంలో నిబంధనలకు తూట్లు

సమయపాలన పాటించని బోట్ల యజమానులు

దేవీపట్నం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను చూడ్డానికి ఎప్పుడెళ్దామా అని ప్రకృతి ప్రేమికులంతా ఎదురు చూస్తుంటారు. గోదావరిలో బోటు షికారు చేస్తూ కొండలు, అడవులను చూస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణం చేయడం మరపురాని అనుభూతి. అయితే నిబంధనలను పట్టించుకోకపోతే ఆనందం మాట పక్కన పెడితే ప్రమాదం కొనితెచ్చుకున్నట్లు అవుతుంది. ప్రస్తుతం పాపికొండలు విహారయాత్రకు వెళ్లే బోట్ల యజమానులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. గత అనుభవాల దృష్ట్యా గోదావరి నదిలో పర్యాటకానికి వెళ్లే బోట్ల రాకపోకల విషయంలో పర్యాటకుల భద్రత దృష్ట్యా నిబంధనలు కఠినతరం చేశారు. పాపికొండలు పర్యాటకానికి వెళ్లే బోటు విధిగా ఉదయం 8.40 గంటలకు బోటు పాయింట్ నుంచి బయల్దేరి సాయంత్రం ఐదు గంటలలోపు తిరిగి గమ్యానికి చేరాలనే నిబంధన ఉంది. మంగళవారం బోటు పాయింటు నుంచి ఉదయం రెండు బోట్లు బయల్దేరి వెళ్లాయి. తెలంగాణ నుంచి సుమారు 60 మంది నిర్దిష్ట సమయం ముగిశాక రావడంతో అనుమతి కోసం వేచి చూశారు. ఎట్టకేలకు ఉదయం 11.30 గంటలకు బోటు పాపికొండలు బయలుదేరింది. సాధారణంగా ఉదయం ఏడు గంటలకు వెళ్లిన బోటు సాయంత్రం రావడానికి 6 లేదా 7 అవుతుంది. అలాంటిది అధికారులు సూచించిన నిర్దిష్ట సమయంలో బోటు వెళ్లకపోవడం, ఆలస్యంగా వెళ్లడాన్ని పలువురు విమర్శించారు. పర్యాటక బోట్లు రాకపోకలు పర్యవేక్షించే పోశమ్మగండి చెక్‌పోస్టు వద్ద నిబంధనలకు విరుద్ధంగా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పాపికొండలు విహార యాత్రలో బోట్ల యజమానులు నిబంధనలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వాణిజ్య పంటలకు నిలయంగా.. కాట్రావులపల్లి



జగ్గంపేట మండలం కాట్రావులపల్లిలో మిరప పంట



కాట్రావులపల్లిలో బంతి తోటలో పూలు కోస్తున్న దృశ్యం

- నల్లరేగడి నేలలు అధికం
- మొక్కజొన్న, పచ్చిమిర్చి, శనగలు, కాయగూర పంటల పెంపకం
- సీజనల్‌గా పూలతోటలు, కొత్తిమీర

జగ్గంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటల్లో కాట్రావులపల్లి ముందంజలో ఉంది. కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని ఈగ్రామంలో రైతులు అధికసంఖ్యలో ఉంటారు. వీరంతా భూములను కౌలుకు తీసుకుని పంటలు పండించడంలో దిట్ట. ఈ ప్రాంతంలో నల్లరేగడి నేలలు అధికంగా ఉండడంతో మొక్కజొన్న, స్వీట్‌కార్న్‌లతోపాటు ఎండుమిర్చి, పచ్చిమిర్చి, శనగలు, మినుములు, కాయగూర పంటలు, సీజనల్‌గా పూల తోటలు, కొత్తిమీర... ఇలా అన్ని రకాలూ పండిస్తున్నారు. వాటిని మార్కెట్లో అమ్మి వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడులను తెచ్చుకోవడంతోపాటు జీవనభృతి పెంచుకోవడంలో ఇక్కడి రైతులు ముందుంటున్నారు. స్వీట్‌కార్న్ సాగులో వీరికి వీరే సాటి. మూడు నెలల్లో పంటలు చేతికొచ్చేలా వ్యవసాయం చేయడంలో ఆరితేరారు. జగ్గంపేట-కాకినాడ ప్రధాన రహదారికి ఇరువైపులా నిత్యం ఏదో ఒక పంట ఎగుమతి అవుతూనే ఉంటుంది. ప్రస్తుతం ఆకుకూరలు, కొత్తి మీర, పూల తోటలు వేసి రైతులు లాభాలు బాటలో వున్నారు. కొత్తమీర పంటకు ఎకరాకు రూ.10వేలు పెట్టుబడి పెడితే రూ.20వేలు ఆదాయం వస్తుందని, రెండు నెలల కాలంలో పంట చేతికి అందుతుందని రైతులు చెప్పారు.

ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

వివాదాలుంటే రెవెన్యూ సదస్సుల్లో సరి చేసుకోవాలి: వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ కమిషనరు సత్యనారాయణ

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని దేవదాయ శాఖ కమిషనరు ఎస్.సత్యనారాయణ సూచించారు. బుధవారం సాయంత్రం ఆయన అన్నవరం దేవస్థానం ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రధానంగా భూములపై చర్చించారు. దేవాలయాల భూముల లీజు విషయంలో అశ్రద్ధ వహించొద్దని, ఆలయ భూముల రికార్డుల విషయంలో తప్పొప్పులు ఉంటే ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని సరిచేసుకోవాలన్నారు. అన్నవరం దేవస్థానం భూములు ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. సత్యగిరి కొండలు 466.34 ఎకరాలు, చెందుర్తిలో 150.50 ఎకరాల కొండ, 66.64 ఎకరాల్లో మారేడువనం పెంపకం, వివిద ప్రాంతాల్లో లీజుల పరిధిలో 71.84 ఎకరాలు, ఆలయ పరిధిలో ఉద్యానవనాలు, ఇతర నిర్మాణాలు 36.94 ఎకరాలు... దేవస్థానం పరిధిలో మొత్తం సుమారు 800 ఎకరాలున్నాయని, ఇందులో 4.75 ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయని ఈవో వివరించారు. అనంతరం సిబ్బందికి కమిషనరు పలు సూచనలు చేశారు. ఆలయ పరిసరాలు, సత్రం గదుల వద్ద పారిశుధ్యం మెరుగ్గా ఉంచాలని, సిబ్బంది విధిగా డ్రెస్‌కోడ్ పాటించాలని, వ్రతమండపాల్లో పురోహితులు దానాల పేరుతో డబ్బులు వసూలు చేయకుండా ఆడియో రికార్డు, ఫ్లెక్సీల ద్వారా భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో దేవదాయ శాఖ ప్రధాన కార్యాలయం నుంచి అదనపు కమిషనరు చంద్రకుమార్, రీజనల్ జాయింట్ కమిషనర్లు ఆజాద్, భ్రమరాంబ, అన్నవరం దేవస్థానం నుంచి ఉప కమిషనరు చంద్రశేఖర్, సహాయ కమిషనరు సీహెచ్ రామ్మోహనరావు, పీఆర్వో కొండలరావు, ఈఈలు, ఏఈవోలు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

సకాలంలో తెరవని కేశఖండనశాల బుకింగ్ కౌంటర్

తాళాలు పగులకొట్టించిన అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు

గుమస్తా సస్పెన్షన్.. కాంట్రాక్ట్ ఉద్యోగి విధుల నుంచి తాత్కాలికంగా తొలగింపు

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు కొరడా ఝుళిపిస్తున్నారు. బుధవారం ఉదయం ఆరు గంటలు దాటినా కేశఖండనశాల బుకింగ్ కౌంటర్ తెరవకపోవడంతో భక్తులు నిరీక్షించాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆకస్మిక తనిఖీ చేసిన ఈవో వెంటనే బుకింగ్ కౌంటర్ తాళాలు పగులగొట్టించి తెరిపించారు. మరొకరిని నియమించి ఇద్దరు ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారులకు సమాచారమివ్వకపోవడంతో కేశఖండనశాల గుమస్తా యడ్ల బుల్లబ్బాయిని సస్పెండ్ చేశారు. సకాలంలో రాని కాంట్రాక్ట్ ఉద్యోగిని ఆర్.మల్లేశ్వరిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఈవో ఆదేశాలు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించి భక్తులకు అసౌకర్యం కల్పిస్తే ఎంతటివారైనా చర్యలకు వెనుకాడబోనని సుబ్బారావు పేర్కొన్నారు.

దుర్గామాత దర్శనానికి పాదయాత్రగా...

రాజానగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం నర్సాపురానికి చెందిన 11 మంది భవానీ మాలధారణ దీక్షతో విజయవాడ దుర్గామాత దర్శనం కోసం ఈ నెల 13న కాలినడకన పయనమయ్యారు. మార్గమధ్యంలో బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం తూర్పుగోనగూడెం చేరారు. విజయవాడ సుమారు 400 కిలోమీటర్లు దూరం ఉంటుందని, భక్తులు ఎవరైనా భిక్ష ఏర్పాటు చేస్తే స్వీకరిస్తున్నామని చెప్పారు. భవానీ మాలలు ధరించడం ఇది 11వ పర్యాయమని, విజయవాడకు తొలిసారిగా పాదయాత్ర చేస్తున్నామన్నారు. ఇంద్రకీలాద్రిపై ఈ నెల 21వ తేదీన చండీ హోమం ప్రారంభం అవుతుందని, 22 నాటికి తాము విజయవాడ చేరుకుంటామని భవానీ మాలధారులు చెప్పారు.




పాదయాత్రగా తూర్పుగోనగూడెం చేరుకున్న భవానీ భక్తులు

పాలన.. గాడినపడేనా?

- అన్నవరం దేవస్థానంలో ఈవోలు మారినా పాలన అస్తవ్యస్తం
- ఆదాయం వస్తున్నా అనవసర వ్యయాలతో ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం
- మార్పులకు శ్రీకారం చుట్టిన నూతన ఈవో సుబ్బారావు

అన్నవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో గత కొంతకాలంగా అస్తవ్యస్తంగా మారిన పాలన నూతన ఈవో రాకతో గాడిన పడుతుందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. వైసీపీ హయాంలో సుమారు రూ.6కోట్లు అనవసర వ్యయమయింది. అనంతరం గతేడాది కార్తీకమాసంలో రామచంద్ర మోహన్ బాధ్యతలు స్వీకరించినా ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు ఉండడంతో వారంలో రెండురోజులు మాత్రమే అన్నవరం విచ్చేసి మిగిలినరోజులు ఈ ఫైలింగ్, చరవాణిలా ద్వారా పాలనను నడిపించారు. అనంతరం ఆయనను దేవదాయశాఖ ప్రధాన కార్యాలయానికి పరిమితం చేసి అన్నవరం దేవస్థానం ఈవోగా సింహాచలం ఈవోగా ఉన్న వేంద్ర త్రినాధరావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనపై కూడా రెండు ప్రధానాలయాల బారం పడడంతో పూర్తిస్థాయి దృష్టిసారించే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో డిప్యూటీ కలెక్టర్ హోదాలో ఉన్న వీర్ల సుబ్బారావు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా ఈనెల 14న బాధ్యతలు స్వీకరించారు. అయితే సుబ్బారావు కొన్ని మార్పులకు శ్రీకారం చుట్టారు. గత 4 రోజులుగా ఆయన ప్రతీ విభాగాన్ని క్షేత్రస్థాయిలోకి వెళ్లి అధ్యయనం చేస్తూ ఆయా విభాగాల పనితీరుపై అవగాహన కల్పించుకుంటూ పాలన సాగిస్తున్నారు. ముందుగా ఆయన తీసుకున్న నిర్ణయం అప్పటివరకు ప్రతి ఫైలు గుమాస్తా వద్ద నుంచి ఏఈవోకు చేరుకున్న తరువాత నేరుగా ఈవోకు చేరేది. అయితే ఈ విధానం తప్పని గ్రహించి పారదర్శకత కోసం సహాయ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌కు చేరిన తరువాతే తన వద్దకు పంపాలని ఆదేశించారు. దీంతో కొన్ని వర్గాలకు ఈ విధానం మింగుడుపడకపోవడంతో పాలన గాడినపడుతున్నట్టేనని చర్చించుకుంటున్నారు. ముందుగా ఆలయంలో విభాగాలు ఎన్ని ఉన్నాయి, వాటి నిర్వహణ తీరు ఏవిధంగా ఉంది తెలుసుకుని నేరుగా ఆయా విభాగ కార్యాలయానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. మరికొన్ని విభాగాలకు సంబంధిత విభాగ ఏఈవో, సూపరెంటెండెంట్‌ను కార్యాలయానికి పిలిపించి మాట్లాడడం చేస్తుండడంతో కిందిస్థాయి ఉద్యోగుల్లో గుబులు ప్రారంభమైంది. మరో 15 రోజులు గడిస్తే పూర్తిస్థాయిలో అవగాహన కల్పించుకుని పాలన పరుగులు పెట్టించేవిధంగా అడుగులు పడతాయని భావిస్తున్నారు. అయితే రాజకీయనేతలు పాలనా వ్యవహారాల్లో వేలు పెట్టనంతవరకు సవ్యంగానే నడుస్తుందని లేకుంటే యథావిధిగా ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నవిదంగా తయారవుతుందనడంలో సందేహం లేదు.


అన్నవరం సత్యదేవుడి ఆలయం

ఆందోళనకరంగా ఆర్థిక పరిస్థితి...

ప్రధానంగా అన్నవరం ఆలయంలో ఆర్థిక పరిస్థితి ఆందోళన కలిగిస్తుంది. గత అధికారులు ఇష్టారీతిన అనవసర వ్యయం చేయడం వాటికి నేడు చెల్లింపులు చేపట్టడంతో బడ్జెట్ మించిపోయింది. దీంతో మిగిలిన నాలుగు నెలలు ఏవిదంగా నెట్టుకురావాలో అర్థంకాని ప్రశ్న. దీనికి సంబంధించి సప్లమెంటరీ బడ్జెట్ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. అన్నవరం ఆలయంలో గత 3 దశాబ్దాలుగా ఏటా స్వామివారి పేరున మిగులు నిధులు డిపాజిట్ చేసేవారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా డిపాజిట్లను విత్‌డ్రాయల్ చేయకుండా చూశారు. ఈ ఏడాది మాత్రం సుమారు రూ.5 కోట్లు వరకు డిపాజిట్లను క్యాన్సిల్ చేయడంతో అన్నవరం ఆలయ ఆర్థిక పరిస్థితి ఏవిధంగా మారిందో అర్థం చేసుకోవచ్చు. వచ్చే ఏడాది మార్చివరకు అనవసర ఖర్చులు తగ్గించి ఆదాయ మార్గాలు పక్కకు వెళ్లకుండా దేవస్థానం ఖజానాకు చేరితే ఆర్థిక పరిస్థితి కొంత మెరుగవ్వచ్చు. ఏది ఏమైనా ఏడాది కాలానికి డిప్యుటేషన్‌పై వచ్చిన నూతన ఈవో సుబ్బారావు సవాళ్లతో కూడిన పాలన చేయాల్సి వస్తుంది. ఆయనకు సత్యదేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆశిద్దాం.

ముగ్గురి హత్య కేసులో...
వేట్లపాలెంలో 12 మంది అరెస్ట్

- అరెస్టయిన వారిలో ముగ్గురు మహిళలు
- మారణాయుధాలు, ఆటో స్వాధీనం
- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, సీఐలు

సామర్లకోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేట్లపాలెంలో ఇంటి నిర్మాణంలో 2 కుటుంబాల మధ్య ఏర్పడిన వివాదంలో ఒక కుటుంబంపై మరొక కుటుంబం కత్తులు వంటి మారణాయుధాలతో ఆదివారం రాత్రి దాడులకు పాల్పడి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులను హత్య చేసి మరో ఏడుగురిని గాయపరిచిన 12 మంది వ్యక్తులను బుధవారం సాయంత్రం సామర్లకోటలో అరెస్ట్ చేసినట్టు సామర్లకోటలో బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడించారు. వివరాల ప్రకారం... కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు దళితచెరువు వద్ద కార్థాల పండు అనే వ్యక్తి ఇంటినిర్మాణంలో భాగంగా శ్లాబ్ పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన బచ్చుల మోషే, బచ్చుల జకరయ్య, బచ్చుల బిల్లప్ప అనే బుల్లప్పి, బచ్చుల దొరయ్య, బచ్చుల రాము, బచ్చుల రాజ్‌కుమార్, బచ్చుల చంద్రరావు, గుల్ల సన్నీ, శీకోటి రాజేంద్రప్రసాద్, బచ్చుల గోపీ, బచ్చుల గవరయ్య, బచ్చుల రాజు, గుడాల సునీల్, బచ్చుల సూర్యాకాంతం, బచ్చుల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి మరికొందరు వ్యక్తులతో కలిసి తొలుత ఇంటి నిర్మాణదారుడితో ఘర్షణలకు సిద్ధపడ్డారు. ముందుగా అనుకున్న వ్యూహం మేరకు తమ వెంట తెచ్చుకున్న కత్తులతో కార్థాల కుటుంబాలకు చెందిన వ్యక్తులపై దాడులకు దిగి నరకడంతో ముగ్గురు మృతి చెందారు. మరికొందరికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పోలీసులు అరెస్టు చేసినవారిలో బచ్చుల జకరయ్య, బచ్చుల మోషే, బచ్చుల బిల్లప్పన్న అనే బుల్ప్పి, బచ్చుల దొరయ్య అనే దొరబాబు, బచ్చుల రాము, బచ్చుల గోపీ, బచ్చుల గవరయ్య అనే చంటి, బచ్చుల రాజు, బచ్చుల సూర్యాకాంతం, బచ్చుల భాగ్యవతి, ద్రోణం సత్యవేణి, కొత్తపల్లి చిన్నయ్యలు ఉన్నారు. హత్యకు ఉపయోగించిన 5 మారణాయుధాలు, 3 కర్రలతో పాటు దాడులకు వినియోగించిన ఆటో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. రెండు కుటుంబాల మధ్య ఆధిపత్య పోరే ముగ్గురి హత్యలకు దారి తీసిందని డీఎస్పీ చెప్పారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అడ్మిన్ ఎస్పీ సూచనలతో పెద్దాపురం డీఎస్పీ పర్యవేక్షణలో సామర్లకోట సీఐ, పెద్దాపురం క్రైం సీఐ తదితర ఎస్‌ఐలతో కలిసి వేట్లపాలెం జీవీకె విద్యుదుత్పత్తి కేంద్రం రోడ్డులో నిందితులను అరెస్ట్ చేశారు. ఇదే కేసులో మరికొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని, కేసు దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతుందని డీఎస్పీ శ్రీహరి రాజు చెప్పారు. కాగా 12 మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు పేర్కొన్నప్పటికీ విలేకరుల సమావేశంలో అరెస్ట్ చేసినవారినెవ్వరినీ పాత్రికేయుల సమావేశంలో హాజరుపర్చకపోవడం గమనార్హం.


పోలీసులు స్వాధీనం చేసుకున్న కత్తులు

కోట సత్తెమ్మ కరుణించమ్మా...


బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్తున్న మహిళలు

వైభవంగా బోనాల సమర్పణ

నిడదవోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్న అమ్మ కోటసత్తెమ్మతల్లి అందరిని కరుణించమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున బోనాలు నెత్తిన పెట్టుకుని అమ్మవారికి చీర, సారె పసుపు కుంకుమలతో తరలివచ్చారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజు పాలెంలో మేళ తాళాలతో అంగరంగ వైభవంగా కోట సత్తెమ్మకు బుధవారం చీర సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్తెమ్మ తిరునాళ్లలో నాల్గోరోజైన బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన అఖిలభారత తెలుగు సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో 101 మంది మహిళలతో అమ్మవారికి చీర, సారె, పసుపుకుంకుమలు సమర్పించారు. రాజమహేంద్రవరం నుంచి బోనాలతో తరలివచ్చిన మహిళలను దేవస్థానం సహాయ కమిషనర్ బి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, సూపరిండెంట్ జల్లా సోమరాజు ఆహ్వానించారు. మహిళలు బోనాలు సమర్పించారు.. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు అప్పారావుశర్మ, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ప్రత్యేక అలంకరణలో కోట సత్తెమ్మ అమ్మవారు

రూ.20 లక్షలకు రూ.20 కోట్లు వస్తాయని...

రైస్ పుల్లింగ్ పేరుతో మోసం చేసిన ఏడుగురి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సర్పవరం సీఐ పెద్దిరాజు

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్ పేరుతో ఓ వ్యక్తిని మోసం చేసిన ఏడుగురు నిందితులను సర్పవరం పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన పెనుమత్స నాగరాజు కాంట్రాక్ట్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సుమారు ఏడాది కిందట అరకు వెళ్లాడు. అక్కడ నాగరాజుకి ఏఎస్ఆర్ జిల్లా పిట్ట దుమ్ముగూడెం మండలం పాడి గ్రామానికి చెందిన పిట్ట గుండన్న, చింతపల్లి మండలం కోతపల్లికి చెందిన గోపీనాయక్, చిన్నలగూడకు చెందిన కిల్లో శ్యాంసన్, కడసిల్పికి చెందిన పొంగి దోహన్ రావు, అరకు వ్యాలీ చిన్నలాబుడకు చెందిన గోపి నాయక్ తిరుపతిరావు, కరబలయ్య సుజాత, సెట్టి బుల్లెమ్మలతో పరిచయం ఏర్పడింది. తమ వద్ద కోట్లు విలువ చేసే రైస్ పుల్లింగ్ కాయిన్ ఉందని, దీనిని విక్రయిస్తే అధిక డబ్బులు సంపాదించవచ్చని, పెట్టుబడి పెట్టాలని నాగరాజుని కోరారు. ఓ కాయిన్‌ని చూపించి ఆశ కల్పించారు. రూ.20లక్షలు పెట్టుబడి పెడితే రూ.20 కోట్లు వస్తాయని నమ్మించారు. వారి మాటలను నమ్మిన నాగరాజు స్నేహితులతో కలిసి నిందితుల అకౌంట్‌లోకి పలు దఫాలుగా రూ.20 లక్షలు పంపాడు. మంగళవారం నిందితులు నాగరాజుకి ఫోన్ చేసి రైస్ పుల్లింగ్ కాయిన్ తీసుకువస్తున్నామని, డబ్బులు సిద్ధంగా ఉంచుకోమని చెప్పారు. డబ్బులు తీసుకుని వెళ్లగా రాగి కాయిన్ ఇచ్చారు. అది పరిశీలిస్తే సీతారామ పట్టాభిషేకం బొమ్మతో ఉంది. మోసపోయినట్టు గుర్తించిన నాగరాజు వారిని ప్రశ్నించాడు. దాంతో నిందితులు చాకు చూపించి రూ.50 వేలు తీసుకుని పరారయ్యారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు మేరకు సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి.పెద్దిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులు సురేష్‌నగర్ పార్కు వద్ద ఉండగా అరెస్ట్ చేసి రూ.50 వేలు, చాకు, రాగి కాయిన్‌ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పలువురు నుంచి రైస్‌పుల్లింగ్ కాయిన్ పేరు చెప్పి మోసంచేసి ఉంటారని తెలిపారు.

ఒత్తిడి అధిగమించేందుకు క్రీడలు దోహదం

- ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక
- ముగిసిన యాన్యువల్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్
- విజేతలకు బహుమతుల అందజేత

సర్పవరం జంక్షన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమని, విధి నిర్వహణలో ఎదురవుతున్న ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని ఏపీఎస్పీ కమాండెంట్ ఎం.దీపిక అన్నారు. కాకినాడ రమణయ్యపేట ఏపీఎస్పీ 3వ బెటాలియన్ ప్రాంగణంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2024 ముగింపు వేడుకలు బుధవారం ఉత్సాహంగా.. ఆహ్లాదకరమైన వాతావరణంలో ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా బహుమతి ప్రదానోత్సవంలో ఆమె మాట్లాడుతూ క్రీడలతో క్రమశిక్షణ, మానసిక ఉత్తేజం లభిస్తా యన్నారు. నిత్యం వ్యాయామం తప్పనిసరని, పోలీసులు ఫిట్‌నెస్‌తో ఉంటే మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించవచ్చన్నారు. ఏటా యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించడంతో ఆరోగ్యంగా, పూర్తి ఫిట్‌గా పోలీసులు ఉంటారన్నారు. 1500 మీటర్లు, 100 మీటర్లు పరుగు పందెం ఫైనల్ పోటీ జరిగింది. స్కావెంజర్స్‌కి స్నాక్ రేస్, బ్యాంకు సిబ్బందికి, టగ్ ఆఫ్ వార్ పోటీలు ఆద్యంతం హోరాహోరీగా సాగింది. పలుపోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులు పంపి ణీ చేశారు. టగ్ ఆఫ్ వార్ పోటీలో కాకినాడ జిల్లా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కమాండెంట్ దీపికలు హుషారుగా పాల్గొని తమ జట్టు సభ్యులతో కలసి తాడు లాగి క్రీడాస్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, పోలీసు సిబ్బంది ఆర్కెస్ట్రాలు ఆకట్టుకున్నాయి. ముగింపు వేడుకల్లో భాగంగా క్యాంప్ ఫైర్ వెలిగించారు. ట్రైనీ డీఎస్పీ సృజన, అదనపు కమాండెంట్, అసిస్టెంట్ కమాండెంట్లు, ఆర్ఐ తదితర అధికారులు పాల్గొన్నారు.



టగ్ ఆఫ్ వార్ పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న కమాండెంట్ దీపిక వెర్సస్ కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ బృందం

పలు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

జీజీహెచ్ (కాకినాడ), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం పలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డా.జె.నరసింహనాయక్ బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫార్మసిస్టులు మూడు పోస్టులు, పోస్ట్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక పోస్టు, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ 2 పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. కావున అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం నందు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు అందజేయాలన్నారు. దరఖాస్తుదారులకు సంబంధించిన నోటిఫికేషన్, అప్లికేషన్ ప్రొఫార్మా NIC http://eastgodavari.ap.gov.in, http://kakinada.ap.gov.in, http://konaseema.ap.gov.in వెబ్సైట్‌నందు పొందపరిచామని చెప్పారు.

21, 22న ఐలాజ్ జాతీయ మహాసభలు

ప్రత్తిపాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ (ఐలాజ్) రెండో జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఐలాజ్ ప్రతినిధులు కోరారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఐలాజ్ జాతీయ మహాసభల కరపత్రాలను వారు ఆవిష్కరించారు. కటక్‌లోని కళా వికాస కేంద్రంలో జరిగే మహాసభలకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిక్ ఏకే పట్నాయక్, జస్టిక్ కె.చంద్రు హాజరై 'న్యాయ వ్యవస్థ, స్వతంత్ర' అంశంపై ప్రసంగిస్తారని ఐలాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుగతా శివ, కోశాధికారి అవసరాల దేవి తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు ఆర్వీ వెంకట్రావు, కార్యదర్శి బొంగులూరు మధుబాబు, మాజీ అధ్యక్షుడు చిట్టింశెట్టి పుల్లయ్య, సీనియర్ న్యాయవాదులు వి.నరసింహారావు, పలివెల నాగేంద్రరాజు, సోము గౌరీశంకర్, అశోక్‌కుమార్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐలాజ్ ప్రతినిధులు

కాకినాడ ఎంపీకి భారత్ గౌరవ్ అవార్డు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. చిన్న వయసు ఎంపీగా, కాకినాడ జిల్లా అభివృద్ధిపై తనదైన మార్క్ చూపిస్తున్న ఆయనకు ఇటీవల న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశాల్లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి పాల్గొన్న తొలి ఎంపీగా చరిత్ర సృష్టించగా తాజాగా ప్రతిష్ఠాత్మక భారత్ గౌరవ్ అవార్డును అందుకున్నారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి నుంచి ఆయన ఈ అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈ అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

జేఎన్టీయూకే ఖోఖో టోర్నమెంట్‌లో
విజేతగా ఐడియల్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు

కాకినాడ రూరల్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుంటూరు విజ్ఞాన్ నీరుల మహిళల ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16,17న జరిగిన జేఎన్టీయూకే కాకినాడ సెంట్రల్ జోన్ మహిళల ఖోఖో టోర్నమెంట్‌లో కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడియల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జట్టు విజేతగా నిలిచినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీకాంత్ తెలిపారు. జేఎన్టీయూకే విశ్వవిద్యాలయ పరిధిలోని 13 కళాశాలల జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా ఐడియల్ జట్టు ఫైనల్లో గెలిచి ట్రోఫీని కైవసం చేసుకుందన్నారు. ఈ జట్టులోని సీఎస్ఈ మొదటి సంవత్సర విద్యార్థిని ఐశ్వర్య, ఈసీఈ మొదటి సంవత్సర విద్యార్థిని మౌనిక కేరళలోని కాలికట్ విశ్వవిద్యాలయంలో జరిగే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్శిటీ ఖోఖో పోటీల్లో జేఎ న్టీయూకే తరపున ఆడేందుకు ఎంపికయ్యారని తెలిపారు. వారిని కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు, కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి, డైరెక్టర్ జీవీ కృష్ణంరాజు, ఏవో వర్మ, శ్రీహరి వర్మ అభినందించారు.


మహిళల ఖోఖో టోర్నమెంట్ విజేత జట్టుతో డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఏవో

14 కాసుల బంగారం, రూ.90వేలు నగదు చోరీ

ఆలస్యంగా వెలుగులోకి

జగ్గంపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామంలో కొద్ది రోజుల క్రితం జరిగిన 14 కాసుల బంగారం, రూ.90వేలు నగదు చోరీ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 14న రాత్రి రామవరంలోని రేవాడ బుజ్జిబాబు ఇంటిలో చోరీ జరిగింది. బుజ్జిబాబు భార్యపిల్లలతో రాజమహేంద్రవరంలోని ఓ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రామవరంలో బుజ్జిబాబు ఇంటిలో తన అత్తగారు భీమవరపు సాయమ్మ(60) నివాసముంటోంది. 14న ఇంటి దగ్గరలోనే ఉంటున్న బంధువుల ఇంటికి సాయమ్మ వెళ్లి రాత్రికి అక్కడే ఉండి పోయిందని, తెల్లవారుజామున వచ్చి చూసే సరికి ఇంటితాళాలు పగలకొట్టి ఉన్నాయని బుజ్జిబాబు తెలిపాడు. అటకమీద డబ్బాలో పెట్టిన 14కాసుల బంగారం, బీరువాలో పెట్టిన రూ.90వేలు నగదు చోరీకి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్ఐ రఘునాథరావు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి దర్యాప్తు చేపట్టి కేసు నమోదు చేశారు.

గంజాయితో ఇద్దరి అరెస్ట్

జగ్గంపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో యువతకు గంజాయి సరఫరా చేస్తున్నారని జగ్గంపేట పోలీసులకు సమాచారం అందడంతో సీఐ వైఆర్కే శ్రీనివాసరావు గంజాయి పొట్లాలు అమ్ముతున్న వారిపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా బుధవారం కాకినాడ జిల్లా జగ్గంపేట నెహ్రూ కాలనీకి చెందిన 20ఏళ్ల సునీల్, రామవరం గ్రామానికి చెందిన 19ఏళ్ల సుధీర్ జగ్గంపేటలో యువతకు గంజాయి సరఫరా చేస్తున్నారని సమాచారం సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ రఘునందనరావుకు అందింది. దీంతో వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద 2.6 కిలోల గంజాయి దొరికింది. కేసు నమోదు చేసి ఇద్దరిని పెద్దాపురం కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు వారికి 14రోజులు రిమాండ్ విధించడంతో పెద్దాపురం సబ్‌జైలుకు తరలించారు. దాడుల్లో హెచ్ సీ రమణ, నాగరాజు, ఏఎస్ఐ కుమార్ తదితరులున్నారు.

రాజమహేంద్రవరంలో బంగారం చోరీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని లింగంపేటలో ఓ ఇంట్లో దొంగలు పడి బంగారు వస్తువులు అపహరించుకుపోయారని త్రీటౌన్ పోలీసులు తెలిపారు. లింగంపేటకు చెందిన వెంకటనారాయణ ఈ నెల 12న కుటుంబ సభ్యులతో కలిసి చెన్నైలోని బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తీసి ఉండడం స్థానికులు చూసి వెంకటరమణకు ఫోను చేసి చెప్పారు. దీంతో అతడు బయలుదేరి బుధవారం నగరానికి చేరుకుని ఇంటికి వెళ్లి చూస్తే తలుపుల తాళాలు పగులకొట్టి ఉన్నాయి. లోపల బీరువాలో పెట్టిన 11గ్రాముల బంగారు వస్తువులు కనిపించలేదు. దీంతో ఇంట్లో దొంగలు పడ్డారని గ్రహించి త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజమహేంద్రవరం కార్పొరేషన్
డీఎస్‌వోపై బ్లేడుతో దాడి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ జనన-మరణ విభాగంలో డీఎస్‌వోగా పని చేస్తున్న డి.రవికుమార్‌పై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేశాడు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. రవికుమార్ మంగళవారం రాత్రి ఆంధ్రానగర్‌లో తన ఇంటి వద్ద బైక్‌ను పార్క్ చేస్తుండగా ఓ గుర్తుతెలియని వ్యక్తి రవికుమార్ పీకపై బ్లేడుతో దాడి చేసి పరారయ్యాడు. దీంతో కంఠం పైభాగంలో గాయమైంది. రవికుమార్‌ను కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

గ్రామాల విలీన ప్రక్రియను నిలిపివేయాలి



మంత్రి నారాయణతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

మంత్రి నారాయణతో భేటీలో ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పొంగూరు నారాయణతో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాజానగరం నియోజకవర్గానికి చెందిన విలీన గ్రామాల సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కోరుకొండ మండలం గాడాల, బూరుగుపూడి, మధురపూడి, నిడిగట్ల తదితర విలీన గ్రామాలు కొన్నేళ్లుగా ప్రత్యేక అధికారుల పాలనలో ఉండిపోయాయన్నారు. దీని కారణంగా పంచాయతీలకు ఎన్నికలు జరగడం లేదని, కేంద్రం నుంచి నిధులు మంజూరుకావడం లేదన్నారు. కావున రాజానగరం నియోజకవర్గానికి చెందిన విలీన గ్రామాల ప్రక్రియను నిలిపివేయాలని మంత్రిని కోరారు. లాలాచెరువు, దివాన్‌చెరువు పంచాయతీలు రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో ఉన్నప్పటికీ సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ పంచాయతీలకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అందించే మౌలిక సదుపాయాలు అందించాలని మంత్రి నారాయణను కోరారు.

తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం



బెలూన్లు ఎగురవేస్తున్న నల్లమిల్లి మనోజ్‌రెడ్డి

అనపర్తి ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డి

అనపర్తి, డిసెంబరు 18 (ఆంధ్ర జ్యోతి): తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలమని కార్యకర్తలకు అండగా నిలిచేది టీడీపీ మాత్రమేనని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి అన్నారు. అనపర్తి నియోజకర్గంలో టీడీపీ సభ్యత్వాలు 50వేలు దాటిన సందర్భంగా బుధవారం స్థానిక ఎస్ఎన్ఆర్ కళ్యాణ మండపంలో పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ముందుగా కేక్ కట్ చేసిన మనోజ్‌రెడ్డి గాలిలోకి బెలూన్లు ఎగురవేసి సంబరాలను ప్రారంభించారు.భారీ బాణా సంచా కాల్చారు. సభ్యత్వ నమోదులో విశేష కృషి చేస్తున్న అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల పార్టీ అధ్యక్షులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, వెలుగుబంటి సత్యనారాయణ, జుత్తుగ కృష్ణలను మనోజ్‌రెడ్డి సత్కరించారు. అలాగే నియోజకవర్గ పరిధిలోని నీటి సంఘాలకు ఎన్నికైన అధ్యక్షులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లను మనోజ్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి ఎకరాకు నీరందించాలన్న సంకల్పంతో ముఖ్యంత్రి నీటి సంఘాల ఎన్నికలు నిర్వహించారని ప్రతిఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించి రైతుల మన్ననలు పొందాలని సూచించారు. ఈ సందర్భంగా డీసీ చైర్మన్లుగా ఎన్నికైన తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, సానా శ్రీనులను మనోజ్ సత్కరించారు.

మైనార్టీలపై వివక్ష చూపడం తగదు

న్యాయవిజ్ఞాన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్‌బాబు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మతం, భాష, సంస్కృతి ఆధారంగా మైనార్టీల పట్ల వివక్ష చూపించడం తగదని అలాచేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు అన్నారు. డీఎల్ఎస్ఏలో బుధవారం మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భారతదేశంలో తక్కువ సంఖ్యలో ఉన్న తరగతుల వారిని మైనార్టీలుగా పరిగణిస్తామన్నారు. జాతీయ మైనార్టీల కమిషన్ చట్టం 1992లో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ చట్టం ముస్లింలకు, క్రైస్తవులకు, సిక్కులకు, బౌద్ధులకు, పార్శీలకు, జైన్ మతాలకు వర్తిస్తుందన్నారు. భారత రాజ్యాంగంలోని 29 మరియు 30 అధికరణలు మత, సాంస్కృతిక, భాషాపరమైన మైనార్టీల హక్కులను పరిరక్షిస్తాయని, వారి వారసత్వం, సంస్కృతిని సంరక్షించడానికి ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఒక్కరికి విద్యను అందించేందుకు వీలు కల్పిస్తాయని తెలిపారు. అనంతరం రాజ్యాంగంలోని మైనార్టీలకు సంబంధించిన అధికరణలను వివరించారు. సదస్సులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మైనార్టీల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునీల్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

లూకాస్ టీవీఎస్ ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

రాజానగరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : గైట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (గైట్) కళాశాలలో ఆఖరి ఏడాది చదువుతున్న 197 మంది విద్యార్థులు లూకాస్ టీవీఎస్‌లో ఇంటర్న్‌షిప్‌లకు ఎంపికైనట్లు జీజీయు ఉపకులపతి యు.చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ వారి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈ ఇంటర్న్‌షిప్ ఎంతో దోహదపడుతుందన్నారు. రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ మాట్లాడుతూ గైట్‌లోని మెకానికల్, ఈఈఈ, ఈసీఈ, ఏఎం విభాగాలతో ఆఖరి ఏడాది చదువుతున్న విద్యార్థులు 321 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా వీరిలో 197 మంది ఎంపికైనట్లు చెప్పారు. వీరంతా లూకా టీవీఎస్‌లో ఆరు నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేస్తారని, నెలకు రూ.12 వేలు స్టైఫండ్‌తో పాటు భోజన సదుపాయం కల్పిస్తారన్నారు. ఎంపికైన వారిని అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీనివాసరావు, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన దుర్గాదేవీ ఉత్సవం



వీరవరం దుర్గాదేవి

కడియం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వీరవరం గ్రామంలో దుర్గాదేవి 40వ వార్షికోత్స వాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మండలంలో పాటు రాజమహేంద్రవరం రూరల్, ఆల మూరు, మండపేట మండలాల నుంచి ప్రతీ ఏటా భక్తులు అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారిని కరెన్సీనోట్లు, పూలమాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు భారీ సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించా రు. ఆలయ పరిసరాలు విద్యుత్ అలంకరణతో కళకళలాడుతున్నాయి. సీఐ ఏ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రత్యేక ప్రణాళికలతో మెరుగైన ఫలితాలు

రాజానగరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధికి అధికారులు, పాలకులు కృషి చేయాలని ఎంపీడీవో జేఏ ఝాన్సీ పేర్కొన్నారు. రెండు రోజులుగా మండల పరిషత్, సెర్ప్ కార్యాలయాల్లో రెండు బ్యాచ్‌లుగా జరిపిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఎంపీడీవో ఝాన్సీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శిక్షణ తరగతులకు రీసోర్స్‌పర్సన్లుగా ఎంపీడీవో ఝాన్సీ, ఏవో ఎం. సుబ్రహ్మణ్యం, ఈవోపీఆర్డీ వాణి, కొత్త తుంగపాడు పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఝాన్సీ

2029 నాటికి 3 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం

గోకవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2029 నాటికి 3లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు తెలిపారు. గోకవరంలో బుధవారం ప్రకృతి సేద్యంపై రైతులతో జరిగిన అవగాహనలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 18 మండలాల్లో ప్రకృతి సేద్యాన్ని రైతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో పండించిన ఆహార ఉత్పత్తుల వల్ల మనిషి ఆరోగ్యానికి అధిక లాభాలు చేకూరుతాయన్నారు. సార్వా సమయాల్లో ప్రకృతి వ్యవసాయానికి రైతులు మొగ్గు చూపడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు

ఎస్టీయూ అధ్యక్షుడిగా చెల్లాజీరావు

కొవ్వూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ కొవ్వూరు మండలాధ్యక్షుడిగా కేవీ చెల్లాజీరావు నియమితులయ్యారు. బుధవారం కొవ్వూరులో ఎస్టీయూ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా చెల్లాజీరావు, ప్రధాన కార్యదర్శిగా వీఎస్ఎం లూథర్, మహిళా కార్యదర్శిగా ఎ.పద్మ, మహిళా కన్వీనర్‌గా ఎస్.వసుంధర, జిల్లా కౌన్సిలర్‌గా కేఎస్ఆర్ ఆంజనేయులు, ట్రెజరర్‌గా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు పెంచాలి



మంత్రి నారాయణకు వినతిపత్రం అందిస్తున్న స్వర్ణాంధ్ర సంస్థ నిర్వాహకుడు గుబ్బల

- ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్
- మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణకు వినతుల వెల్లువ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పర్యటనకు వచ్చిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణను నగరపాలక సంస్థ కార్యాలయంలో పలు ఉద్యోగ సంఘాలు, కాంట్రాక్టర్లు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు కలిసి వినతులు అందించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు సోమాదుల యేసుబాబు, సహాయ కార్యదర్శి బుంగా యెషయారాజు, అధ్యక్షుడు సిరికి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి పాలిక బాలభవాని కుమార్, ఉపాధ్యక్షుడు మందనక్క సాయి మంత్రి నారాయణ కలిసి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు టెక్నికల్ రూ.29,200, నాన్ టెక్నికల్ రూ.24,500లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే తామంతా సమ్మెలో ఉన్న విషయాన్ని తెలియజేశారు. అలాగే స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు మంత్రిని కలిశారు. రాష్ట్రంలో ఉన్న 89 నిరాశ్రయుల కేంద్రాలకు నిధులు అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 2016లో ప్రారంభించిన 89 నిరాశ్రయుల కేంద్రాలు ప్రస్తుతం నిధులు లేక ఇబ్బందులు పడుతున్నాయని, వాటిలో 59 షెల్టర్‌లకు నిధులు విడుదల కాక రెన్యువల్ చేయక స్వచ్ఛంద సంస్థలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని వివరించారు. మంత్రి దీనిపై స్పందించి నిధులు విడుదలకు కృషి చేస్తానన్నారు. అదేవిధంగా రాజమహేంద్రవరం మున్సిపల్ కాంట్రాక్టర్లు మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. తాము చేసిన పనులకు సంబంధించి సీఎండీఎఫ్ గ్రాంట్ బిల్లులు రూ.1.30 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఇప్పించాలని కమిషనర్, కలెక్టర్‌లకు ఇప్పటికే విన్నవించామని, అయినా సమస్య పరిష్కారం కాలేదని, తమరు దృష్టి పెట్టి బిల్లుల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి పరిశీలన చేస్తామన్నారు.

తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ చైర్మన్ పదవికి నోటిఫికేషన్



సీతానగరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ చైర్మన్ పదవికి బుధవారం ఎన్నికల అధికారి పోలవరం ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళా వందన నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం ఆమె సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేస్తూ ఈ నెల 21న చైర్మన్, వైస్ చైర్మన్ పదవులకు ఎన్నిక నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామన్నారు. 21వ తేదీ ఉదయం 9గంటలకు సభ్యులు హాజరు కావాలన్నారు. ఈ మేరకు మండలం లోని 4 నీటి సంఘాల చైర్మన్లకు నోటీసు జారీ చేస్తున్నామని, నలుగురు నుంచి చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారని, మిగిలిన వారు సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు.

వలస కార్మికులకు అవగాహన సదస్సు

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రోగ్రాం ఇన్‌చార్జి అమీర్ పాషా

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వైఎంవీఏ హాలులో బుధవారం స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో వలస కార్మికుల అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్టుమెంట్ బీఎస్ఎమ్ వల్లి, క్రైమ్ సీఐ రాంబాబు, పారా సంస్థ డైరెక్టర్ థామస్ పల్లితానం ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వివిధ పనుల కోసం వలస వెళ్లే కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి ఎండీ అమీర్ పాషా మాట్లాడుతూ వలస కార్మికుల సమస్యల పరిష్కారానికి పారా సంస్థలతో పాటు ప్రభుత్వ, ఇతర సేవా సంస్థలతో కలిపి సంయుక్తంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్వచంద సేవా సంస్థల ప్రతినిధులు లెనర్వో కాలేజీ ప్రిన్సిపాల్ రోషన్, ఫాదర్ సింహనాయుడు, యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకుడు ఆంజనేయులు, ప్రజ్వల సేవా సంస్థ, సీఎఫ్‌సీ ప్రతినిధి అయేషా, హరిత దళం సంస్థ ప్రతినిధిచిట్టిబాబు, పుష్కర్ మాత కృష్ణ, సేఫ్టీ నెట్స్ వెంకట్ లక్ష్మి, నాగమణి, మేదర్ పేట లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



ఎమ్మెల్యే ఆదిరెడ్డికి తీర్మానల కాపీని అందిస్తున్న నాయకులు

ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మన పుట్టుక మన చేతిలో ఉండదని, కాని ఎలా జీవించాలనేది మన చేతిలోనే ఉంటుందని, అదే రాజ్యాంగమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డులోని ప్రభతోటలో బుధవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎలా బతకాలో రాజ్యాంగం స్పష్టంగా చెబుతుందన్నారు. బడుగు బలహీనవర్గాల జీవితాల్లో వెలుగులు నింపేంత అద్భుతంగా రాజ్యాంగాన్ని అంబేడ్కర్ మహాశయులు రచించారని చెప్పారు. ఆ మహనీయుడి ఆశయ సాధనకు మనమంతా కృషి చేయాలన్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి పార్టీలకు అతీతంగా అందరినీ ఆహ్వానించామన్నారు.ఇక్కడ చేసిన తీర్మాణాలన్నీ నెరవేర్చేలా కృషి చేద్దామన్నారు. విధానాల్లో మార్పుతెద్దామని భవిష్యత్తు తరాలకు బంగారు బాట వేద్దామని పిలుపునిచ్చారు. బలహీన వర్గాలు ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్లను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గత పాలకులు కమిషన్లకు కక్కుర్తిపడి బీసీ, ఎస్టీ వసతి గృహాలను నిర్లక్ష్యం చేస్తే తాము అధికారంలోకి వచ్చాక సీఎస్ఆర్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించామని చెప్పారు. సమ్మేళనంలో తిలక్‌కుమార్, నయనాల కృష్ణారావు, డాక్టర్ కోమలి, సానబోయిన రామారావు, బుడ్డిగ శ్రీనివాస్, రొంగల శ్రీనివాస్, టి.రాజేంద్రప్రసాద్, ఎండీ అబ్దుల్లా తదితరులు మాట్లాడారు. అనంతరం తొలి దళిత కవి కుసుమ ధర్మన్న మనుమరాలు కుసుమ రాజకుమారిని ఘనంగా సత్కరించారు. సమేళనంలో తీర్మానాలను టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచపల్లి ప్రసాద్ ప్రవేశపెట్టగా అందరు ముక్తకంఠంతో ఆమోదించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సూక్ష్మ ఆహార పరిశ్రమల అభివృద్ధికి 35శాతం రాయితీ

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

రాజమహేంద్రవరం రూరల్ డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ పీడీ మూర్తి అధ్యక్షతన మత్యశాఖ, వ్యవసాయశాఖ హార్టీకల్చర్, ఎస్ఈసీడీ, ఏపిఎమ్ఐపి శాఖల సమన్వయంతో అమలవుతున్న పలు పథకాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హార్టీకల్చర్ శాఖ ద్వారా ఫుడ్ ప్రోసెసింగ్ యూనిట్ల ద్వారా సూక్ష్మఆహార పరిశ్రమల అభివృద్ధికి 35శాతం రాయితీపై అందించడం జరుగుతుందన్నారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు కలెక్షన్ సెంటర్లు, కోల్డ్ స్టోరేజ్ రూమ్‌ల కొరకు 35శాతం రాయితీ గరిష్టంగా 11,25,000 అందించడం జరుగుతుందన్నారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు విత్తనాల నిమిత్తం 50 శాతం రాయితీపై ఇవ్వడం జరుగుతుందన్నారు. మత్యశాఖ ద్వారా అలంకరణ చేపల యూనిట్ కు రూ.3లక్షలు లోనుకు 60 శాతం సబ్సిడీ ఇస్తారని, ద్విచక్రవాహనం ఐస్ బాక్స్ నకు రూ.75వేలు, ఎస్‌సి యస్‌టి, మహిళలకు 60 శాతం రాయితీపై ఇస్తారన్నారు. పశుగ్రాసం వేస్తే ఎకరానికి రూ.33000 ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, 18 మండల సమాఖ్యలధ్యక్ష్యులు సెర్ఫ్ సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం

గోకవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సభల్లో రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గోకవరం సచివాలయం ఆవరణలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. అసైన్డ్, రిజిస్ట్రేషన్, సీలింగ్ భూమి ఆక్రమణల గురించి రైతులు నిర్భయంగా రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు అందజేసి రసీదు పొందాలన్నారు. రైతుల నుంచి వివిధ సమస్యలపై పన్నెండు దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ సాయి ప్రసాద్ తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధిని తట్టుకోలేక తెలంగాణ మంత్రుల అసహనం

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవడాన్ని కొందరు తెలంగాణ మంత్రులు తట్టుకోలేక అసహనంతో వ్యాఖ్యలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్నికృష్ణ మండిపడ్డారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతిలో మాట్లాడారు. అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి బిల్డర్స్ వెనుకంజ వేస్తున్నారని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు నిస్పృహతో చేసినట్లు అర్థమౌతుందన్నారు. ఎన్‌టీఆర్ ఘాట్‌ను కూలదోసి అక్కడ తెలంగాణ సచివాలయం నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ప్రకటనలు కోట్లాది ఎన్‌టీఆర్ అభిమానుల మనోభావాలను దెబ్బతీశాయని ధ్వజమెత్తారు. తెలుగు రాష్ట్రాల మధ్య చిచ్చు రేపడానికి ఇలాంటి దోరణులు ఉపయోగపడతాయని అన్నారు.

ఎక్సైజ్ సిబ్బందిని అడ్డుకున్న వ్యక్తిపై కేసు

బిక్కవోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రంగంపేట ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ కానిస్టేబుల్ కోళ్ల లక్ష్మి, హెచ్‌సీ త్రిమూర్తులను విధులు నిర్వర్తించకుండా అడ్డుకున్న టి.అర్జున్‌పై కేసు నమోదు చేసినట్లు బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం...ఎక్సైజ్ కానిస్టేబుల్ లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ ఎన్.త్రిమూర్తులతో కలసి బుధవారం ఎక్సైజ్ ఎస్ఐ ఆదేశాల మేరకు ఉదయం రంగాపురం గ్రామంలోని కేతా అప్పలనర్సమ్మ ఇంటికి వెళ్లి తనిఖీ చేస్తుండగా తనుబోయిన అర్జున్ అనే వ్యక్తి ఇల్లు తనిఖీ చేయడానికి మీరెవరూ అంటూ వారి విధులను ఆటంక పరిచాడు. దీంతో అర్జున్‌పై చర్యలు తీసుకోవాలంటూ కానిస్టేబుల్ లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసామని ఎస్ఐ వివరించారు.

జాతీయ కవి గరిమెళ్ల వర్ధంతి



రాజమహేంద్రవరం కల్చరల్ డిసెంబర్18(ఆంధ్యజ్యోతి): స్వాతంత్ర్య సమరోద్యమకారుల్లో గొప్ప తెగువను, ఉత్తేజాన్ని నింపేలా దేశభక్తి గీతాలు రాసిన గొప్ప జాతీయ కవి గరిమెళ్ళ సత్యనారాయణ అని, ఆంధ్రకేసరి యువజన సమితి పూర్వ అధ్యక్షులు మాదిరాజు శ్రీనివాస్ అన్నారు. గరిమెళ్ళ 52వ వర్ధంతి కార్యక్రమం, స్వాతంత్ర సమరయోధులు పార్కులో బుధవారం జరిగింది. కార్యక్రమానికి, అధ్యక్షత వహించిన దేశిరెడ్డి బలరామ నాయుడు, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాదిరాజు మాట్లాడుతూ నాటి సత్యాగ్రహంలో వీర రసాన్ని అందించిన గీతాల నకలు కాపీలు, కేవలం 12 పైసలకు అమ్ముడుపోయాయని తెలిపారు. ఆనాడు, దేశభక్తి మీద కవిత్వం రాసినందుకు, మూడేళ్ల జైలు శిక్ష అనుభవించిన గొప్ప దేశభక్తుడు గరిమెళ్ల అని అన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు దూర్వాసుల సత్యనారాయణ తదితురులు పాల్గొన్నారు.



శ్రీవాణి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

శ్రీవాణి చెక్కుల పంపిణీ

కోరుకొండ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల్లో నిర్మించే పలు ఆలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) శ్రీవాణి ట్రస్టు ద్వారా మంజూరైన రూ.20 లక్షల చెక్కులను సంబంధిత ఆలయాల కమిటీ సభ్యులకు ఆయా గ్రామాల కూటమి నాయకులకు, దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అందజేశారు. కోరుకొండ గ్రామంలో నిర్మించే శ్రీ సీతారాముల ఆలయానికి రూ.5లక్షల చెక్కును, శ్రీరంగపట్నం గ్రామంలో వినాయకస్వామి ఆలయానికి రూ.3.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందించారు. సింగవరం కోదండ రామాలయానికి రూ.3 లక్షల చెక్కు, ముక్కినాడ విశ్వేశ్వరస్వామి ఆలయానికి రూ.3.33 లక్షల చెక్కు, సీతారాంపురం శ్రీకృష్ణ గీతా మందిరానికి రూ.4.59 లక్షల చెక్కును ఎమ్మెల్యే అందించారు.

పుష్కర చైర్మన్‌కు ఎమ్మెల్యే సత్కారం: పుష్కర ఎడమ ప్రధాన కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన అడబాల వీర వెంకట సత్యనారాయణ, ప్రశాంతి దంపతులను ఎమ్మెల్యే బలరామకృష్ణ దంపతులు బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

కడియం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం ఇస్తున్న శిక్షణ ఎంతో దోహదపడుతుందని డీఆర్‌డీఏ పీడీ ఎన్వీవీఎస్ మూర్తి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ తెలిపారు. వెలుగు కార్యాలయంలో యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు కొవ్వొత్తుల తయారీపై ఇస్తున్న శిక్షణను పరిశీలించారు. కార్యక్రమంలో కడపకు చెందిన శిక్షకురాలు ఖాదిర్‌బీ, యూనియన్ బ్యాంక్ ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రులను కలిసిన మార్గాని సోదరులు



రెవెన్యూ మంత్రికి మొక్కను అందిస్తున్న మార్గాని సోదరులు

కడియం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు టీడీపీ నాయకులు బొర్రా శ్రీనివాస్ ఇంటిలో బుధవారం జరిగిన శుభ కార్యక్రమంలో ఆయ న సమీప బంధువులు కడియపులంక వీరహనుమాన్ నర్సరీ అధినేత, టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, గౌతమి నర్సరీ అధినేత, టీడీపీ రాష్ట్ర నాయకుడు మార్గాని వీరబాబులు హాజరయ్యారు. కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లను కలిసి మొక్కలను అందించారు. కార్యక్రమంలో మార్గాని శేషు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలతో తల్లి, బిడ్డలకు హానికరం

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): వివాహానికి తగిన వయసుతోపాటు శారీరక, మానసిక సంసిద్ధత అవసరమని మహిళా శిశు సంక్షేమ విభాగం అధికారి రాజ్‌కుమార్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వరా ఆనం కళా కేంద్రంలో బాల్య వివాహాలు, బాలికలపై లైంగిక వేధింపులు అంశంపై అవగాహన సదస్సు జరిపారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మహిళా సాధికారత విభాగం, జిల్లా మహిళా శిశు సంక్షేమ విభాగం సంయుక్తంగా దీన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల తల్లితోపాటు పుట్టే బిడ్డకు కూడా హానికరం అన్నారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత విభాగం కో ఆర్డినేటర్ పి.సురేఖ, టీం సభ్యులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకే ఆర్‌జీఎస్ఏ ప్రణాళికలు

అనపర్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ఆర్‌జీఎస్ఏ ద్వారా ప్రణాళికలు రూపొందించుకోవాలని అనపర్తి ఎంపీడీవో ఎం.రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తి ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన రెండో రోజు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

'ఎస్సీ, బీసీల ఆత్మగౌరవం దెబ్బతీయడం బాధాకరం'

మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ పెద్దలు ఎస్సీ, బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం దుర్మార్గమని మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరంలోని వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీలను అణగదొక్కే కార్యక్రమం చేస్తున్నారని ఇది సరికాదన్నారు. తనపై చేస్తున్న భూ కబ్జా ఆరోపణలపై విచారణకు సిద్ధమన్నారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



కోట సత్తెమ్మకు బోనాలు సమర్పణ


అమ్మవారికి హారతి



నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో మేళ తాళాలతో వైభవంగా కోట సత్తెమ్మకు భక్తులు బుధవారం చీర సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్తెమ్మ తిరునాళ్లలో నాల్గోరోజైన బుధవారం 101 మంది మహిళలతో అమ్మ వారికి చీర, సారె, పసుపు కుంకుమలు సమర్పించారు. - 8లో

విమానాశ్రయం వద్ద మంత్రి నారాయణకు ఘన స్వాగతం


మంత్రి నారాయణకు విమానాశ్రయం వద్ద నేతల ఘన స్వాగతం

కోరుకొండ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం విచ్చేసిన మంత్రి నారాయణకు బుధవారం మధురపూడి విమానాశ్రయం వద్ద ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి వాసు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కలెక్టర్ ప్రశాంతి తదితరులు ఘనస్వాగతం పలికారు.

'గ్రేటర్' కల నిజమయ్యేనా..



- జూలైలోపు రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఎన్నికలు
- మంత్రి నారాయణ స్పష్టీకరణ
- 2019 జూలై 2వ తేదీతో ముగిసిన పాలకవర్గం
- పదేళ్ల తర్వాత రానున్న ఎన్నికలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు వచ్చే ఏడాది జూన్, జూలై నెలల్లో జరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ స్వయంగా చెప్పడంతో రాజకీయ వర్గాల్లో సందడి నెలకొంది. అయితే ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న గ్రేటర్ రాజమహేంద్రవరం కల నెరవేరుతుందా.. పరిసర గ్రామాల విలీన ప్రక్రియ పూర్తిచేసి ఎన్నికలు నిర్వహిస్తారా, లేదా ఇప్పుడున్న విధంగానే జరుగుతాయా అనేది స్పష్టత లేదు. గోదావరి పుష్కరాలు, ఇతర అంశాలపై రాజమహేంద్రవరంలో బుధవారం జరిగిన సమీక్షకు వచ్చిన మంత్రి నారాయణ మీడియా ప్రశ్నలకు కూడా స్పష్టత ఇవ్వలేకపోయారు. కానీ కొందరు ఎమ్మెల్యేలు మాత్రం గ్రామాల విలీనంతోనే ఎన్నికలు జరుగనున్నాయని, కోర్టు కేసుల్లో ఉన్న విలీన సమస్యను పరిష్కరించి ఎన్నికలు వెళతామని చెప్పడం గమనార్హం. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థలో రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని గ్రామాలు, కోరుకొండ మండలంలోని కొన్ని గ్రామాలు, రాజానగరం మండలంలోని కొన్ని గ్రామాలతో మొత్తం 22 గ్రామాలతో కలసి గ్రేటర్ రాజమహేంద్రవరం చేయాలని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం ఆలోచన చేసింది. గ్రామాలను విలీనం చేసి 54 డివిజన్లతో గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ మాస్టర్ ప్లాన్ కూడా సిద్ధం చేసింది. గ్రామాలను అనుసంధానం చేస్తూ 80 అడుగుల నుంచి 100 అడుగుల రోడ్లు నిర్మించడానికి, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు కల్పించడానికి అప్పట్లో ప్లాన్ చేసింది. పరిసర గ్రామాలన్నీ అభివృద్ధి చేయడం ద్వారా సిటీని విస్తరించాలని ప్లాన్ చేశారు. కానీ 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో విలీన ప్రక్రియ మూలన పడింది. కేవలం కొన్ని గ్రామాలనే విలీనం చేసి, డివిజన్ల సంఖ్య 54 నుంచి 52కు తగ్గించే ప్రయత్నం చేశారు. అదీ సాగలేదు. గ్రామాల విలీనాన్ని కొందరు నాయకులతో కలసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఖాళీ స్థలాల యజమానులు ఆపేసినట్టు ప్రచారం జరిగింది. దాంతో గ్రేటర్ రాజమహేంద్రవరం కలలు సన్నగిల్లాయి. గ్రామాలకు రోడ్లు, డ్రెయిన్లు లేవు. పారిశుధ్య సమస్యలు కూడా ఎక్కువగా ఉన్నాయి. అలాగని అక్కడి గ్రామాలకు ఎన్నికలు కూడా నిర్వహించలేదు. దీంతో 15 ఆర్థిక సంఘం నిధులు కూడా రావడంలేదు. ఫలితంగా గ్రామాలు ఇబ్బంది పడుతున్నాయి. ఎన్నికలు లేక కార్పొరేషన్‌లోనూ ఇబ్బంది కలుగుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ గ్రేటర్ కలలు వికసిస్తాయనే భావం కలిగింది. కొద్దిరోజుల కిందట ఎయిర్‌పోర్టుకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద పలువురు ఎమ్మెల్యేలు గ్రామాల విలీనం, ఎన్నికల గురించి ప్రస్తావించినట్టు సమాచారం. ప్రస్తుతం మంత్రి ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పడంతో ఈలోపు విలీన ప్రక్రియ పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

● 22 గ్రామాలు విలీనం చేస్తారా?

మొదట్లో ప్రతిపాదించినట్టు రాజమహేంద్రవరం రూరల్ మండలం మొత్తం కలపడంతో పాటు, కడియం మండలంలోని వేమగిరిని, కోరుకొండ మండలంలోని కొన్ని గ్రామాలను, రాజానగరం మండలంలోని పలు గ్రామాలను కలపి మొత్తం 22 గ్రామాలను విలీనం చేస్తారా లేదా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తం అవుతున్నాయి. రాజానగరం మండలంలోని పలు గ్రామాలను విలీనం చేయడానికి అక్కడి స్థానిక నేతల అభ్యంతరం చెబుతున్నట్టు ప్రచారం ఉంది. కానీ ప్రజలు మాత్రం విలీనం కోరుకుంటున్నారు. ముఖ్యంగా యువత అభివృద్ధిని కోరుకుంటోంది. నగరపాలక సంస్థ విస్తీర్ణం పెరిగితే పరిసర ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని భావిస్తోంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం మాత్రం పూర్తిగా కలిసిపోయినట్టే. వేమగిరి కూడా విలీనం అయినట్టే చెప్పవచ్చు. రూరల్ మండలంలోని ఒకటి రెండు గ్రామాల నుంచి కోర్టు కేసులు ఉన్నాయి. వాటిని పరిష్కరించే ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి. అదే ప్రయత్నం కోరుకొండ, రాజానగరం మండలం నుంచి కూడా జరిగితే ఆయా ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయి. కార్పొరేషన్‌లో కలిపితే పన్నులు పెరిగిపోతాయనే భయాన్ని ప్రజల్లో కొందరు కల్పిస్తున్నారు. కానీ గ్రామాల్లో కూడా పన్నులు కడుతున్నారు కదా? విలీనమైతే రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం లభిస్తుంది. ప్రజల జీవన విధానంలో మార్పు వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● ఎన్నికల కోసం ఎదురుచూపులు

వచ్చే ఏడాది జూలైలోపు ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి నారాయణ స్పష్టంచేయడంతో ప్రజలు, రాజకీయ వర్గాల్లో సందడి నెలకొంది. జోష్ పెరిగింది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పాలకవర్గం ఎన్నికలు రాష్ట్ర విభజన తర్వాత 2015లో తెలుగుదేశం పార్టీ హయాంలో జరిగాయి. మేయర్‌గా పంతం రజనీ శేషసాయి తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికైన సంగతి తెలిసిందే. వారి పాలక వర్గం 2019 జూలై 2తో ముగిసింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ గెలవడంతో జూలైలో ఎన్నికలు నిర్వహించలేదు. తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. దీనికి ప్రధాన కారణం నగరపాలక సంస్థ పరిధిలో టీడీపీకి కంచుకోట. ఇప్పటివరకూ జరిగిన మేయర్ ఎన్నికల్లో టీడీపీనే గెలిచింది. ముఖ్యంగా బీసీలు ఎక్కువ. బీసీ, ఎస్సీలు సుమారు మూడో వంతు వరకూ ఉన్నారు. టీడీపీకి బీసీల సపోర్టు చెక్కుచెదరకుండా కొనసాగుతోంది. ఈ పరిస్థితుల్లోనే గెలవలేమనే భయంతోనే వైసీపీ ఎన్నికలు నిర్వహించలేదనే విమర్శలు అప్పట్లో వినిపించాయి. ఈసారి తెలుగుదేశం -జనసేన- బీజేపీ కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందడి రానుంది.

పుష్కరాలు-2027కు సన్నద్ధం కావాలి!





పుష్కరాలు, ఇతర అంశాలపై రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో బుధవారం జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ.. సమీక్షకు హాజరైన అధికారులు

- రెండేళ్లలో పనులు పూర్తి చేయాలి
- ఇప్పటికే రాజమండ్రి-కొవ్వూరుకి కలిపి 1868.70 కోట్ల ప్రతిపాదనలు
- ఘాట్లు, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కారం కావాలి
- అధికారుల సమీక్షలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు 2027కు అధికారులంతా సన్నద్ధం కావాలని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ ఆదేశించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం రాజమండ్రి నగరపాలక సంస్థ, కొవ్వూరు డివిజన్ అధికారులతో మంత్రి నారాయణ, కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేక అధికారి పి.ప్రశాంతి, ఎమెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకట్రావు, రుడా చైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, కమిషనర్ కేతన్‌గార్గ్, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత లతో పుష్కరాల 2027పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత కమిషనర్ కేతన్‌గార్గ్ పుష్కరాలకు సంబంధించి రాజమహేంద్రవరంలో చేపట్టే ఘాట్ల నిర్మాణ ప్రతిపాదనలు, రహదారుల ప్రతిపాదనలు, డ్రైనేజీ నిర్మాణాలు, తాగునీటి సదుపాయాలు, రవాణా సదుపాయాలు, వసతి సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు సంబంధించి రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలకు, ఘాట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్టు చెప్పారు. నాలుగు కొత్త ఘాట్ల నిర్మాణాలు చేపడతామని మంత్రి దృష్టికి తెచ్చారు. అదేవిధంగా కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత కూడా కొవ్వూరు, నిడదవోలు, విజ్జేశ్వరం, కుమారదేవం, ప్రాంతాలలో అభివృద్ధిపనులు, కొవ్వూరు గోష్పదాల రేవు అభివృద్ధి, బ్యూటిఫికేషన్, గోదావరి సురక్షిత తాగునీరు అందించే ప్రతిపాదనలు, రహదారుల విస్తరణ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వీటన్నింటిపైన జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యేలతో మంత్రి చర్చించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళిక రూపొందించినట్టు తెలిపారు. ఆసియన్ డవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా గతంలో ప్రతిపాదించిన పనులను ఫిబ్రవరి నెలలో తిరిగి ప్రారంభించనున్నట్టు చెప్పారు. 70 శాతం ఏడీబీ రుణం, మిగిలిన 30 శాతం ప్రభుత్వ గ్రాంటు విడుదల చేయడం జరుగుతుందన్నారు. తాగునీటి సమస్యను అధిగమించేందుకు అమృత్ పథకం 2.0 పథకం కింద రూ.8400 కోట్లు కేంద్రం గ్రాంటు ఉందని, ఇందులో కేంద్రం 36.70 శాతం గ్రాంటు ఇస్తున్నట్టు చెప్పారు. మిగిలిన నిధులను స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వ 15వ ఆర్థిక సంఘం నిధులు అనుసంధానం చేయనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల పనులు రానున్న రెండేళ్లలో పూర్తిచేసి గోదావరి పుష్కరాల నాటికి రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి అదనపు పన్నులు వేయకుండా అసెస్మెంట్‌లు చేస్తామని, దీని ద్వారా నగరంలో రూ.79 కోట్ల బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకుంటామన్నారు. అనధికార కట్టడాలకు సంబంధించి సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. 2027 గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో 1587.80 కోట్లు, కొవ్వూరు డివిజన్‌లో రూ.280.90 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. మొత్తం రూ1868.70 కోట్లు ప్రతిపాదనలు ఉన్నాయని అన్నింటిపైన సీఎం చంద్రబాబుతో చర్చిస్తానని, మరొక 15 రోజుల్లో మళ్లీ వచ్చి అన్ని ప్రభుత్వ శాఖలతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. పుష్కరాలకు మనకు సమయం ఉంది కాబట్టి అన్ని పనులు ఇప్పటి నుంచే మొదలు పెట్టుకోవాలన్నారు. అదేవిధంగా రాజమహేంద్రవరం సిటీకి సంబంధించి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్‌కు సంబంధించి ఎమ్మెల్యే గోరంట్ల, కొవ్వూరుకు సంబంధించి ముప్పిడి వెంకట్రావులు పుష్కరాల పనులు, సమస్యలపై మంత్రి నారాయణ, కలెక్టర్ ప్రశాంతిలతో చర్చించారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎస్ఈ జి పాండురంగారావు, డిప్యూటి కమిషనర్ ఎస్ వెంకటరమణ, రుడా అధికారులు మూర్తి, టౌన్ ప్లానింగ్ అధికారి కోటయ్య, నగర పాలక సంస్థ అధికారులు మాలిక్, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అందరూ 'నిరుపేదలే!'

జిల్లాలో రేషన్ కార్డుల సంఖ్య చూస్తే 80 శాతం మంది ఇప్పటికీ పేదరికంలోనే మగ్గుతున్నారు. కేవలం పది శాతం మంది మాత్రమే సంపన్నులు. మిగిలిన వారంతా నిరుపేదలు. చిత్రంగా ఉన్నా గణాంకాలను పరిశీలిస్తే ఇదే పరిస్థితిని తెలియజేస్తోంది. రేషన్ బియ్యం పక్కదారి పడుతున్న నేపథ్యంలో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. పేదలు పంపిణీ చేస్తున్న బియ్యం తినకుండా వందలాది టన్నుల మేర అమ్మేసుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్న తరుణంలో ఈ బియ్యం ఎవరు అమ్మేస్తున్నారన్న చర్చ కూడా వస్తోంది. అనర్హులకు ఉన్న కార్డుల వారికి కేటాయించిన బియ్యమే ఎక్కువగా పక్కదారి పడుతోందన్నది తాజా చర్చ.

- జిల్లాలో సుమారు 80 శాతం మంది దిగువ తరగతి వారే
- 5,74,907 బీపీఎల్ కార్డులు
- 16 లక్షల మందికి రేషన్
- 2,39,021మందికి పింఛన్లు
- అర్హులకు అన్యాయం..అనర్హులకు కార్డులిచ్చిన గత వైసీపీ ప్రభుత్వం

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు, పింఛన్లు, ఉచిత గ్యాస్ పథకంతోపాటు ప్రభుత్వ పేదలకు ప్రవేశపెట్టే ఏ పథకానికైనా తెల్లరేషన్ కార్డునే పరిగణలోకి తీసుకుంటారు. గత ప్రభుత్వాలు ఓట్ల రాజకీయంతో నిబంధనలను పక్కనపెట్టి తెల్లరేషన్ కార్డులు నిజమైన అర్హులను తొలగించి అనర్హులకు మంజూరు చేసేశారు. నిరుపేదలకు, పూరిగుడిసెల్లో నివసించేవారికి, అత్యల్ప ఆదాయం గలవారికి తెల్లరేషన్ కార్డుల మంజూరు చేయడంలో తప్పులేదు. కానీ భారీగా ఆస్తులు, పొలాలు ఉన్నవారికి, ప్రైవేటు కంపెనీలో పనిచేసేవారికి, పిల్లలు విదేశాల్లో స్థిరపడి ఆర్థికంగా కలిగినవారికి, ఆదాయపు పన్ను రిటర్న్ ఫైల్ చేసినవారికి కూడా స్థానిక నేతల సహకారంతో తెల్లరేషన్ కార్డులు మంజూరు చేసేశారు. ఇక రికార్డులను పరిశీలిస్తే జిల్లాలో 5 లక్షల 74వేల 907 బీపీఎల్ కార్డులున్నాయి వీటి ద్వారా 15 లక్షల 99వేల 725 మంది లబ్ధిదారులు రేషన్ తీసుకొంటున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 18లక్షల 32వేల 332 మంది, అదే 2023 లెక్కల ప్రకారం 19 లక్షల 81 వేల 551 మంది ఉన్నారు. ఇదంతా సంబంధిత అధికారుల ఇచ్చిన నివేదిక ప్రకారమే. ఏ నివేదికల ప్రకారం చూసుకున్నా జిల్లా జనాభాలో 80 శాతం పైబడి నిరుపేదలే ఉన్నట్టు లెక్క. కార్డులన్నీ 2023కు ముందువే. వీరిలో సుమారు 80శాతం పైబడి రేషన్ సరుకులు వినియోగించుకోనివారే. లబ్ధిదారులు రేషన్ వెహికిల్ వద్దకు వచ్చి వేలిముద్ర వేసి సరుకులను డబ్బులిచ్చి కొనుక్కోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో లబ్ధిదారులు వేలిముద్ర వేస్తే డీలరు లబ్ధిదారునికి బియ్యం కిలో ఒక్కింటికి రూ.8 నుంచి 9 (ప్రాంతాలను బట్టి) చెల్లిస్తూ సరుకు మాత్రం అక్రమార్కులకు చేరవేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే రేషన్ పోర్టిఫైడ్ బియ్యం తింటే చాలా జబ్బులు తగ్గించుకోవచ్చు. అలాంటి బియ్యం మాఫియా చేతుల్లోకి పోతోంది. ఇదంతా సివిల్ సప్లయి అధికారుల పర్యవేక్షణ లోపమంటూ కొందరు, ఈ వ్యవహారమంతా అధికారులకు తెలిసే జరుగుతుందంటూ మరికొందరు ఆరోపణలు చేస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా 3.60 లక్షల ఇళ్లు

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని 146 పంచాయతీల్లో 2లక్షల6వేల335, కొవ్వూరు డివిజన్ పరిధిలో 153 పంచాయతీల పరిధిలో లక్షా 53 వేల 984 పంచాయతీ అధికారుల నివేదికల ప్రకారం ఎసెస్‌మెంట్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా పలు రకాల పింఛన్లు కలిపి 2 లక్షల 39వేల 21 మంది లబ్ధిదారులకు పింఛన్లు సుమారు రూ.102 కోట్లు ప్రభుత్వం నెల నెలా పంపిణీ చేస్తోంది.







ఢిల్లీలో కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, కేంద్ర రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్, కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీలను ఎంపీ పురందేశ్వరితో కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి సమస్యలపై కేంద్ర మంత్రులకు వినతి

ఢిల్లీలో ఎంపీ పురందేశ్వరితోపాటు కలిసిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అనపర్తి నియోజకవర్గం బిక్కవోలులోని లక్ష్మీ గణపతి ఆలయం, గోలింగేశ్వర స్వామి పెదపూడి మండలం గొల్లల మామిడాడ సూర్యనారాయణమూర్తి, కోదండ రామాలయాల్లో మౌలిక సదుపాయాలు, వసతుల కల్పనకు టెంపుల్ టూరిజం ద్వారా ప్రసాద్ స్కీం ద్వారా నిధులు మంజూరు చేయాలని కేంద్ర సాంస్కృతిక పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరుతూ వినతిపత్రం అందజేశారు. బుధవారం ఎంపీ పురందేశ్వరితో కలిసి ఆయన మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే విశాఖకు వెళ్లేందుకు ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను తొలగించేందుకు అనపర్తిలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కల్పించాలని కేంద్ర రైల్వేమంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనపర్తి రైల్వే స్టేషన్‌కు కల్పించాల్సిన సౌకర్యాలు, రైళ్ల హాల్టు విషయాలను ఎమ్మెల్యే మంత్రికి వివరించగా ఆయన సానుకూలంగా స్పందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే నియోజకవర్గంలో పలు రోడ్లను సీఆర్ఐఎఫ్ నిధులతో అభివృద్ధి చేయాలని కేంద్ర రోడ్డురవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ జైరామ్ గడ్కరీకి కూడా వినతిపత్రం అందజేశానని నల్లమిల్లి తెలిపారు.


రాజమహేంద్రవరం మండలం హుకుంపేటలో అధికారులకు సూచనలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

హుకుంపేట రెవెన్యూ సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆకస్మిక తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో భూసంబంధిత సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రజలు ప్రత్యక్ష హాజరు సమయంలో రికార్డులను పరిశీలించడం, వాస్తవ పరిస్థితులను వివరించడం కోసం గ్రామ రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేటలో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామసభలు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించి భూ సంబంధిత అంశాలపై వచ్చిన అర్జీలను స్వీకరించాలన్నారు. స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. సదస్సుల్లో వచ్చిన ప్రతి అర్జీని పీజీఆర్ఎస్ పోర్టరులో అప్‌లోడ్ చేయాలన్నారు. కాగా బుధవారం ఇక్కడ నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 14 అర్జీలు రావడం జరిగిందని తహశీల్దార్ కుమార్ తెలిపారు.

ఉద్యోగ కల్పనే కూటమి ధ్యేయం

» ఎమ్మెల్యే ముప్పిడి » కొవ్వూరులో మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వర రావు అన్నారు. ఈ నెల 21 కొవ్వూరులోని ఏబీ ఎన్ అండ్ పీఆర్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టరును బుధవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువతకు ఉద్యోగాల కల్పనతో పాటు రాష్ట్ర ఆదాయం పెంచడానికి మంత్రి లోకేశ్ పనిచేస్తున్నారన్నారు. 34 కంపెనీల్లో 1500 మందికి ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, 10వ తరగతి నుంచి పీజీ చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జనవరిలో జాబ్ క్యాలెండర్ అని చెప్పి మోసగించారన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుబ్బారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, వికాస ప్రతినిధులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

నల్లజర్ల పోలీస్‌స్టేషన్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ దేవకుమార్

నల్లజర్ల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పండుగ పేరుతో పేకాట, కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. ఉదయం 11గంటలకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న డీఎస్పీ సాయంత్రం వరకు రికార్డులను పరిశీలించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది క్రైం రేటు, ప్రమాదాల సంఖ్య, దోపిడీలు, చోరీలు వంటి వాటిపై కింది స్థాయి అధికారులకు పలు హెచ్చరికలు జారీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లజర్ల మండలంలో ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని, ఒక సీఐ, ముగ్గురు ఎస్ఐలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్టు చెప్పారు. ఈ వ్యవస్థ అసాంఘిక కార్యక్రమాలు, గంజాయి రవాణా, కోడి పందేలు, పేకాట శిబిరాలు వంటి వాటిపై పని చేస్తుందన్నారు. ప్రతిఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. దీనిపై ప్రస్తుతం కేసులు నమోదు చేస్తున్నట్టు డీఎస్పీ వివరించారు. ఆయన వెంట సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సోమరాజు, రమేష్ ఉన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీలు


రాష్ట్ర మహిళా క్రికెట్ జట్టును అభినందిస్తున్న జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు

దేవరపల్లి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20, 21, 22 తేదీల్లో రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ పోటీలు మచిలీపట్నంలో జరుగుతాయని వ్యాయమోపాధ్యాయుడు ఓరుగంటి నాగరాజు తెలిపారు. రాష్ట్రస్థాయి మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సువర్ణరాజు దేవరపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం అభినందించారు. క్రీడాకారులకు ప్రయాణఖర్చులు, క్రీడా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కాట్నం గణేష్, చప్పటి శివనాగప్రసాద్, పసుపులేటి ప్రసాద్, ఆకుల వీరరాజు, జాజిమొగ్గల శ్రీనివాస్, పీఈటీలు, నాగరాజు, మునేశ్వరరావు పాల్గొన్నారు.

'అంబేడ్కర్‌ను అవమానించేలా కేంద్ర మంత్రి మాటలు'

కొవ్వూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో కేంద్ర హోంమంత్రి అమిత్ షా అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడడాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు ఖండించారు. రాజ్యాంగాన్ని రక్షించాలంటూ ఇండియా కూటమి ఎంపీలంతా రాజ్యాంగాన్ని, ప్రతులను పట్టుకుని నినాదాలు చేస్తుంటే.. దానికి పోటీగా ఎన్డీఏ ఎంపీలు మోదీ మోదీ అని అరవడం సిగ్గుచేటన్నారు. భారతదేశానికి ఎంత ప్రమాదం ముంచుకొస్తుందో హోంమంత్రి ప్రకటించడమే ఉదాహరణ అన్నారు. దేశంలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులన్నీ ఏకమై బీజేపీని ఒంటరి చేయాల్సిన అవసరాన్ని మరొక్కసారి ఈ సంఘటన గుర్తుచేస్తుందన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన ఎంపీలు వారి స్వార్థ ప్రయోజనాల కోసం బీజేపీకి మద్దతు ఇస్తూ దేశ, రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారన్నారు. రాజ్యాంగం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా బీజేపీకి మద్దతు ఉప సంహరించుకోవాలని సుందరబాబు పేర్కొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో స్టాంపుల కొరత

కొవ్వూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నాన్ జ్యుడీషియల్, కోర్టు ఫీజు స్టాంపులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాగంటి చలపతిరావు అన్నారు. గత 6 నెలలుగా రిజిస్ట్రార్ కార్యాలయంలో రూ.1,2,5,10, 20ల నాన్ జ్యుడీషియల్ స్టాంపులు కొరత ఏర్పడింది. కొవ్వూరు మున్సిఫ్ కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి, 9వ అదనపు జిల్లా జడ్జి కోర్టులకు నిడదవోలు, జంగారెడ్డిగూడెం, గోపాలపురం, కొయ్యలగూడెం, పోలవరం మండలాల కక్షిదారులు వస్తుంటారు. కోర్టుల్లోను, నోటరీ అఫిడవిట్లకు కోర్టు ఫీజు, నాన్ జ్యుడీషియల్ స్టాంపులు లేకపోవడంతో కక్షిదారులు న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి స్టాంపులు అందుబాటులో ఉంచాలని చలపతిరావు కోరారు.

కొత్తపల్లి అగ్రహారంలో కాలువ గండ్లు పూడ్చివేత

పెరవలి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి అగ్రహారం పరిధిలోని పంట కాలువ గండ్లు పడి సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతుల తమ సమస్యను నూతనంగా ఎన్నికైన పేకేరు నీటి సంఘం అధ్యక్షుడు నల్ల సురేంద్ర దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఇరిగేషన్ ఏఈ మురళీతో మాట్లాడి బుధవారం గండి పూడ్చే కార్యక్రమం చేపట్టారు. మూడు చోట్ల ఈ విధంగా గండ్లు పడగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి లస్కర్‌లు, రైతులు కూలీలతో ఈ గండ్లు పూడ్చే కార్యక్రమం చేపట్టారు. దీంతో తమకు సక్రమంగా సాగునీరు అందుతుందని రైతుల హర్షం వ్యక్తంచేశారు.

పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాసరావు

ఉండ్రాజవరం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామానికి చెందిన బూరుగుపల్లి శ్రీనివాసరావు ఎన్నికపట్ల మండలంలోని నాయకులు, అధికారులు బుధవారం అభినందనలు తెలిపారు. శ్రీనివాసరావు మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సోదరుడు. వేలివెన్ను ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయనను శేషారావు, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, పలువురు నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది కలసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సీహెచ్ రాజు పాల్గొన్నారు.

కోట సత్తెమ్మ కరుణించమ్మా!

అమ్మవారికి 101 మంది మహిళలతో బోనాల సమర్పణ


కలశాలతో కోట సత్తెమ్మ ఆలయానికి వెళ్తున్న దృశ్యం

నిడదవోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్న అమ్మ కోటసత్తెమ్మ తల్లి అందరిని కరుణించమ్మా అంటూ మహిళలు పెద్ద ఎత్తున బోనాలు నెత్తిన పెట్టుకుని అమ్మవారికి చీర సారె పసుపు కుంకుమలతో తరలి వచ్చారు. మేళ తాళాలతో అంగరంగ వైభవంగా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మకు బుధవారం చీర సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్తెమ్మ తిరునాళ్లలో నాలుగో రోజైన బుధవారం రాజమహేంద్రవరానికి చెందిన అఖిల భారత తెలుగుసేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, అడ్వకేట్ జి.ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో 101 మంది మహిళలతో అమ్మవారికి చీర సారె పసుపు కుంకుమలు సమర్పించారు. రాజమహేంద్రవరం నుంచి బోనాలతో తరలి వచ్చిన మహిళలను దేవస్థానం సహాయ కమిషనర్ బి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ దేవులపల్లి రవిశంకర్, సూపరిండెంట్ జల్లా సోమరాజు ఆహ్వానించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు అప్పారావుశర్మ, వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల సమర్పణతో ఆలయ ప్రాంగణమంతా కోటసత్తెమ్మకు నామస్మరణతో మారుమ్రోగింది.

వలసలపై అవగాహన సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వైఎంవీఏ హాలులో బుధవారం స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో వలస కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్టుమెంట్ బీఎస్ఎమ్ వల్లి, క్రైమ్ సీఐ రాంబాబు, పారా సంస్థ డైరెక్టర్ థామస్ పల్లితానం విచ్చేసి ఇతర రాష్ట్రాలకు, దేశాలకు వలస వెళ్లే వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు.

నిధులు ఎందుకు రద్దు చేశారు?

» చిడిపి సర్పంచ్ లక్ష్మణరావు
» దొమ్మేరులో మధ్యలో నిలిపివేసిన నిర్మాణాలను పూర్తి చేయాలి
» ఎంపీటీసీ శ్రీరాంప్రసాద్
» కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


సమస్యలను వివరిస్తున్న చిడిపి సర్పంచ్ లక్ష్మణరావు

కొవ్వూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడానికి ప్రతిఒక్కరూ సహకారం అందించాలని ఎంపీపీ కాకర్ల నారాయుడు అన్నారు. బుధవారం కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. చిడిపి సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రామంలో 8 కల్వర్టులు నిర్మాణం చేపట్టాలని 2020 నుంచి పోరాడుతున్నానన్నారు. 2021లో సర్పంచ్‌గా ఎన్నికైనా పనులు చేపట్టలేకపోయానని అసహనం వ్యక్తంచేశారు. ఇటీవల గ్రామానికి మంజూరైన రూ.15 లక్షల నిధులు మంజూరైతే ఎందుకు రద్దు చేశారని పీఆర్ ఏఈ త్రిమూర్తులును ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రతిపక్షంలో ఉన్నామని కూటమి ప్రభుత్వంలోనైనా గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో పిటీషన్లు పెట్టడంతో పనులు చేపట్టడానికి ఎవ్వరూ ముందుకు రావడం లేదని, కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని, కాంట్రాక్టరును చూడాలని ఏఈ త్రిమూర్తులుకు సూచించారు. ఎంపీటీసీ యలమర్తి శ్రీరాంప్రసాద్ మాట్లాడుతూ దొమ్మేరులో మధ్యలో నిలిచిపోయిన హైస్కూల్‌లో భవనం, గ్రామంలో డ్రైనేజి నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. పశువుల ఆసుపత్రిలో చేపట్టిన పనులకు బిల్లుల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. మార్చిలోపు బడ్జెట్ విడుదలై నిధులు వస్తే మండలంలో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీలు వీరమళ్ల నారాయుడు, నూతంగి రేఖ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణ తలంబ్రాలకు
చిట్యాలలో ధాన్యం సేకరణ

గోపాలపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో జరిగే శ్రీసీతారామ కల్యాణంలో వినియోగించే తలంబ్రాల కోసం ప్రత్యేకంగా ఊడ్చిన వరిచేను కంకులను శ్రీరామభక్తులు మండలంలోని చిట్యాల గ్రామంలో బుధవారం సేకరించారు. ఈ సందర్భంగా శ్రీరామ ఆధ్యాత్మిక సమితి సభ్యులతో కోసే కార్యక్రమాన్ని అధ్యక్షుడు ముళ్లపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ భద్రాచలంలో శ్రీసీతారామ కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాల బియ్యం కోసం చిట్యాలలో ప్రత్యేకంగా శ్రీరామభక్తులు స్వయంగా నాట్లు వేశారని, ధాన్యం సిద్ధం కావడంతో సేకరణలో ఎటువంటి యంత్ర పరికరాలు వినియోగించకుండా శ్రీరామ భక్తులే స్వయంగా చేతితో గింజలు ఒలిచి ఆ సేకరించిన మొత్తాన్ని భద్రాచలం సీతారామ స్వామి ఆలయానికి స్వయంగా వెళ్లి అందిస్తామన్నారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న
వాహనాల సీజ్



నల్లజర్ల, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న ఐదు టిప్పర్లు, ఒక ప్రొక్లెయినర్‌ను సీజ్ చేసినట్టు తహశీల్దార్ పి.కృష్ణారావు తెలిపారు. ఆవపాడు రెవెన్యూ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తున్న తాడేపల్లిగూడెం మండలం కుంచనపల్లి గ్రామానికి చెందిన డి.చిన్నాకు చెందిన ప్రొక్లెయినర్, ఐదు టిప్పర్లను సీజ్ చేసి నల్లజర్ల పోలీసులకు అప్పగించారు.

గోపాలపురంలో క్రిస్మస్ వేడుక

గోపాలపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వందమంది వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు అన్నదానం చేసి అనంతరం రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దైవజనులు జాషువా స్టీఫెన్ మాట్లాడుతూ రక్షణ సేవా సమితి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకుల పాటి లలితశ్రీను, గెల్లా ఎలీషా, ఏసురాజు, రాజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో మంత్రులు
అనగాని, వంగలపూడి

నిడదవోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని ప్రముఖ వ్యాపారవేత్త బొర్రా శ్రీనివాస్ గృహానికి బుధవారం సాయంత్రం రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, హోమ్ మంత్రి వంగలపూడి అనిత విచ్చేశారు. కొద్దిసేపు నివాసంలో గడిపి అనంతరం అమరావతి ప్రయాణమయ్యారు.

సచివాలయ మహిళా
పోలీసులతో సమావేశం



తాళ్లపూడి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరిగే కార్యక్రమాలపై సచివాలయ మహిళా పోలీసులు దృష్టి సారించి వాటిని తన దృష్టిలో పెట్టాలని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం సచివాలయ మహిళా పోలీస్‌లకు సమావేశం నిర్వహించారు. పండుగల సందర్భంగా గ్రామాల్లో జరిగే అసాంఘిక కార్యక్రమాల గురించి సమాచారం సేకరించి తెలియచేయాలని చెప్పారు.

విద్యుదాఘాతంతో
యువకుడి మృతి

నిడదవోలు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం సమిశ్రగూడెంలోని లోహియానగర్‌కు చెందిన కె.రాంబాబు (27)అట్లపాడు సమీపంలో క్రిస్మస్ వేడుకలకు సంబంధించి టెంట్ వేస్తుండగా విద్యుత్ లైన్‌కు తగిలి షాక్‌కు గురయ్యాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై సమిశ్రగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాడుతున్న 8 మంది అరెస్టు

పెరవలి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఖండవల్లిలో పేకాట ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. వారి నుంచి రూ.5,010 నగదు , 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

ఎస్టీయూ కొవ్వూరు
అధ్యక్షుడిగా చెల్లాజీరావు

కొవ్వూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ కొవ్వూరు మండలాధ్యక్షుడిగా కేవీ చెల్లాజీరావు నియమితులయ్యారు. బుధవారం కొవ్వూరులో ఎస్టీయూ నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా చెల్లాజీరావు, ప్రధాన కార్యదర్శిగా వీఎస్ఎం లూథర్, మహిళా కార్యదర్శిగా ఎపద్మ, మహిళా కన్వీనర్‌గా ఎస్.వసుంధర, జిల్లా కౌన్సిలర్‌గా కేఎస్ఆర్ ఆంజనేయులు, ట్రెజరర్‌గా కేవీడీ శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు.

గ్రామాల సుస్థిరాభివృద్ధికి ప్రభుత్వం కృషి

» ఏపీఎస్ఐఆర్‌డీ డిప్యూటీ డైరెక్టర్ రమణ
» సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై ముగిసిన రెండో విడత శిక్షణా కార్యక్రమాలు


ఉండ్రాజవరం సమావేశంలో మాట్లాడుతున్న డీడీ రమణ

దేవరపల్లి/చాగల్లు/ఉండ్రాజవరం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):గ్రామాల సుస్థిర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐఆర్‌డీ) డిప్యూటీ డైరెక్టర్ జి.రమణ అన్నారు. దేవరపల్లి, చాగల్లు, ఉండ్రాజవరం మండలాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ ఉద్యోగులకు నిర్వహిస్తున్న రెండో విడత శిక్షణా కార్యక్రమం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల లక్ష్యాలు, అందరికీ ఉపాధి, ఆహార భద్రతా, ఆరోగ్యం, విపత్తుల నుంచి రక్షణ, ప్రజలు సామాజిక, ఆర్థిక సమస్యలకు గురికాకుండా చూడడం, పిల్లలందరూ స్కూళ్లు వెళ్లేలా చూడాలన్నారు. పాఠశాలల్లో పుస్తకాలు అందజేయడం, మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలు చూడాలన్నారు. పంచాయతీ చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో పేదరిక నిర్మూలన, ప్రజల ఆరోగ్యం, తాగునీరు అవసరాలు తీర్చడం, పరిసరాల పరిశుభ్రత, సుపరిపాలన వంటి లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీవోలు ఆర్.శ్రీదేవి, వేణుగోపాల్ రెడ్డి, వీఎస్ రామారావు, ఈవోపీఆర్డీ కేఎస్ఆర్ శర్మ, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కుమారి, ఏపీఎంలు నాగలక్ష్మి, ఈ.శ్రీనివాసుబాబు, ఎంఈవో సుభాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.తిలక్ పాల్గొన్నారు.

కొవ్వూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని దొమ్మేరు, కాపవరం, పంగిడి, నందమూరు, పశివేదల గ్రామాలకు సంబంధించి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో 2025-26 సంవత్సరానికి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన హరిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి రూ పొందించిన లక్ష్యాలను చేరుకునేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, సర్పంచ్‌లు, ప్రభుత్వ మండల శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ 2030 నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 17 విభాగాల్లోని 9 లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరన్న, ఏపీఎం మంగాయమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యకుమారి, ఆర్ఎంసీ రవిప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన శిక్షణా కార్యక్రమంలో సుమారు 75మంది పలు శాఖల ఉద్యోగులతో పాటు సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు.


తాళ్లపూడిలో శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

భూసమస్యల పరిష్కారానికి సదస్సులు

» జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు
» పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
» వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించిన అధికారులు

పెరవలి, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): రైతుల భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు పేర్కొన్నారు. బుధవారం ఖండవల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సుకు ఆయన విచ్చేసి మాట్లాడుతూ రైతులకు పాసుబుక్‌లు కావాలన్నా, భూ విస్తీర్ణంలో తేడాలున్నా, పేరు మార్పులు అవసరమైనా, ఇంకా ఇతర సమస్యలు ఉన్నప్పటికీ రెవెన్యూ సదస్సుల్లో అధికారుల దృష్టికి తీసుకురావచ్చునన్నారు. ఈ సమస్యలను త్వరగా పరిష్కరించడానికి అధికారులు కృషి చేస్తారని జేసీ చెప్పారు. ఈ సందర్భంగా గ్రామంలో శ్మశానానికి సరైన దారి లేదని, ఆక్రమణలతో విస్తీర్ణం తగ్గిపోయిందని పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే డంపింగ్ యార్డు కావాలని పేర్కొన్నారు. మొత్తం 42 అర్జీలు రాగా వాటిలో భూములు ఆన్‌లైన్ చేయాలని 27, నోషనల్ కాతా నుంచి భూములకు విముక్తి కల్పించాలని 10, రేషన్ కార్డు కోసం 3 అర్జీలు సమర్పించారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అచ్యుతకుమారి, సర్పంచ్ పులిదిండి నాగరాజు, ఉపసర్పంచ్ అతికాల వెంకట రామకృష్ణమ్మ, భూపతిరాజు రవివర్మ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో జరిగిన సదస్సులో తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అంతకుముందు గ్రామంలో పలు వీధుల్లో పర్యటించి రెవెన్యూ సదస్సుల లక్ష్యాలను తెలియజేశారు. గ్రామాల్లో రైతులు తమ భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో చావా శ్రీనివాసరావు, యనమదల శివరామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని చిక్కాల గ్రామంలో జరిగిన రెవె న్యూ సదస్సులో అధికారులు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 13 అర్జీలు స్వీకరించారు. సమస్యలను సకాలంలో పరిష్కరించి అర్జీదారులకు న్యాయం చేస్తామని తహశీల్దార్ ఎం.మెరికమ్మ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్.శ్రీదేవి, సర్పంచ్ కె.మణి, ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని ప్రకాశరావుపాలెంలో జరిగిన సదస్సులో రైతులు తమ సమస్యలను తహశీల్దార్ కృష్ణారావుకు వివరించారు. డి.సుబ్బారావుకు చెందిన భూమి ఆన్‌లైన్‌లో తక్కువ విస్తీర్ణం చూపిస్తోందని, సుకన్యకు చెందిన రెండు ఎకరాల భూమికి పాస్‌బుక్ ఇప్పటి వరకు అందలేదని, పలు రైతులకు చెందిన భూములకు పట్టాదారు పాస్‌బుక్, ఆన్‌లైన్‌లో భూమి లేకపోవడం, సర్వే చేయమని దరఖాస్తు చేసుకున్న ఇప్పటివరకు సర్వే బృందం రాకపోవడం వంటి సమస్యలు సభ దృష్టికి వచ్చాయి. సమస్యలను పరిష్కరిస్తామని, రైతులు ఆందోళన పడొద్దని తహశీల్దార్ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ విక్టర్, ఉపసర్పంచ్ యద్దనపూడి బ్రహ్మారాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.


యర్నగూడెంలో ఇళ్ల స్థలాలు పరిశీలిస్తున్న ఆర్వో శివజ్యోతి

దేవరపల్లి: మండలంలోని యర్నగూడెంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు విచ్చేసిన ఆర్వో శివజ్యోతి, తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి ముందుగా గ్రామంలోని దళిత వాడల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పెనుమత్స సుబ్బరాజు, గద్దే శ్రీనివాస్, బొల్లిన భాస్కర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జగనన్న ఇళ్ల స్థలాలు ఊరికి మూడు కిలోమీటర్ల దూరంలో కేటాయించారని, ఆ స్థలాల్లో ఎవరూ ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు రావడంలేదని తెలపడంతో ఆ ఇళ్ల స్థలాలను ఆర్వో శివజ్యోతి వెళ్లి పరిశీలించారు. ఈ విషయంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. కాగా రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలపై 16 అర్జీలు అందాయని తహశీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. రీసర్వేకు 11, ఆర్వోఆర్‌కు 4 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని సంజీవపురం సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు.. రైతులు భూసమస్యలు పరిష్కరించాలని, పొలాలకు వెళ్లే మార్గాలు ఏర్పాటు చేయాలని కోరుతూ 17అర్జీలు అందాయి. కార్యక్రమంలో వీఆర్వో రాంబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఆరికిరేవులలో ర్యాలీ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కేంద్ర మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలి

మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం

కొవ్వూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిషా క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని మాల సంఘాల జేఏసీ కన్వీనర్ బొంతా శ్యాం రవిప్రకాష్ డిమాండ్ చేశారు. పార్లమెంటు సాక్షిగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానిస్తూ మాట్లాడడం దుర్మార్గమన్నారు. అంబేడ్కర్, అంబేడ్కర్ అనడం ఫ్యాషన్‌గా మారిందని, అన్నిసార్లు దేవుని పేరు స్మరిస్తే స్వర్గంలో స్థానం దక్కుతుందన్నారు. పార్లమెంటులో అమిత్‌షా వ్యాఖ్యలు అతని అహంకారానికి నిదర్శనమన్నారు. తక్షణం క్షమాపన చెప్పి తన పదవికి రాజీనామా చేయకపోతే దేశవ్యాప్త ఆందోళన చేపడతామన్నారు.